సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
బుధవారం, 11.02.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 111
పేజీలు: 12 వెల: రూ. 5


రాష్ట్రపతి పరిశీలనలో

# తెలంగాణ బీసీ రిజర్వేషన్ల బిల్లు

## కేంద్రం స్పందన

- రాష్ట్రపతి వద్దకు చేరిన రెండు బిల్లులు..
- ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నకు సమాధానంగా కేంద్రమంత్రి బీపీఎల్ శర్మ వివరణ
- బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలన దశలోనే ఉన్నాయన్న కేంద్రం
- శాసనసభ కార్యదర్శి పంపిన బిల్లులపై తుది నిర్ణయం పెండింగ్




తెలంగాణ ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం వివరణ ఇచ్చింది. మంగళవారం లోక్‌సభలో ఎంపీ ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు.. కేంద్ర సామాజిక, న్యాయవాద మంత్రి బీపీఎల్ శర్మ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పంపిన రెండు బిల్లులు రాష్ట్రపతి వద్దకు వచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చాయన్నారు. ఆ రెండు బిల్లులు పరిశీలన దశలో ఉన్నాయని స్పష్టం చేశారు.



# అరెస్ట్ రాజకీయం!

## స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల మంట

స్థానిక సమస్యలే ప్రాతిపదికగా జరగాల్సిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు ఈసారి అరెస్ట్ రాజకీయాల వేదికగా మారాయి. అభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలు వెనుకబడగా.. కేసీఆర్, కేటీఆర్ అరెస్ట్ చేయాలా? ఎవరు అడ్డుకుంటున్నారు? అన్న ప్రశ్నలే ప్రధాన ఎజెండాగా మారాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య పరస్పర ఆరోపణలతో మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా రాష్ట్రస్థాయి రాజకీయ పోరుగా మారాయి.

- మున్సిపల్ పోరులో కేసీఆర్-కేటీఆర్ అరెస్ట్ అస్త్రం
- అరెస్టు డిమాండ్ల మధ్య రేవంత్ డబుల్ గేమ్ ఆరోపణలు
- కేసీఆర్ అరెస్టుపై కాంగ్రెస్-బీజేపీ పరస్పర ఆరోపణలు
- అరెస్టుల వెనుక రాజకీయ పర్యవసానాల లెక్కలు
- 'అస్మదీయులు ఎవరు?' అంటూ పార్టీల నిందల యుద్ధం
- స్థానిక సమస్యలు పక్కన.. మున్సిపల్ ఎన్నికల్లో స్వార్థ రాజకీయం

09

## తెలంగాణ రైతు సగటు అప్పు

# ₹1,52,113

## లోక్‌సభలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడి

- రైతు అప్పుల్లో ఏపీ టాప్, తెలంగాణ ఐదో స్థానం
- దేశ ఆర్థిక వ్యవస్థకు గ్రామీణ రంగమే ఆధారం
- ఆర్థిక సంస్కరణలున్నా వ్యవసాయ రంగం సంక్షోభంలోనే
- రైతుల అప్పులు ఉపాధి అవకాశాలపై ప్రభావం



రైతుల అప్పులపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక ప్రకటన చేశారు. మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. రైతులు అధిక అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితా వెల్లడించారు. మొదటి స్థానంలో ఆంధ్రప్రదేశ్, ఐదో స్థానం లో తెలంగాణ ఉన్నట్లు తెలిపారు. దేశంలోనే ఏపీ రైతులపై అధిక అప్పుల భారం ఉన్నట్లు చెప్పారు. జూలై 2018 నుంచి జూన్ 2019 మధ్య ఏపీ రైతు సగటు అప్పు రూ. 2,35,554, తెలంగాణ రైతు సగటు అప్పు రూ. 1,52,113 ఉన్నట్లు స్పష్టం చేశారు. కాగా దేశఆర్థిక వ్యవస్థకు మూలం గ్రామీణ, వ్యవసాయ రంగాలే. 1991 తర్వాత చేపడుతున్న ఆర్థిక సంస్కరణలు ఇండియాను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా మలిచినా, వ్యవసా య రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగు పడకపోవడం గమనార్హం.

## అల్లాదుర్గంలో చిరుత సంచారం

### ఆనవాళ్ల గుర్తింపు

- గొల్లకుంట తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో మకాం
- గొర్ల కాపరులు, రైతులు అటువైపు వెళ్లొద్దు
- మరోసారి కనిపిస్తే సమాచారం ఇవ్వాలి
- శంకరంపేట్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమేష్ కుమార్

09



నగరాలు.. పట్టణాల్లో రాజకీయ భవితవ్యం తేలే ఘడియ

# నేడే ఓటర్ డే




**పోలింగ్ వివరాలు**

| | |
|---|---|
| కార్పొరేషన్లు (కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ) | :07 |
| డివిజన్లు | : 414 |
| మున్సిపాలిటీలు | :116 |
| వార్డుల సంఖ్య | :2,582 |
| పోటీలో ఉన్న అభ్యర్థులు | :12,930 |
| ఓటర్లు | :52,43,023 మంది |
| పురుష ఓటర్లు | :25,62,639 |
| మహిళా ఓటర్లు | :26,80,014 |
| రాష్ట్ర వ్యాప్తంగా కేంద్రాల | :8,203 |
| బ్యాలెట్ బాక్సుల ఏర్పాటు | :16,031 |
| రిటర్నింగ్ ఆఫీసర్లు | :1,379 మంది |
| అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు | :1,547 మంది |
| ప్రిసైడింగ్ ఆఫీసర్లు | :9,560 మంది |
| విధులు నిర్వర్తించనున్న సిబ్బంది | :31,428 మంది |
| బ్యాలెట్ బాక్సులను భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్‌లు | :137 |
| ఓట్ల లెక్కింపు కేంద్రాలు | :136 |

- పుర సమరానికి రంగం సిద్ధం: 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఉత్కంఠ పోలింగ్
- అన్ని పార్టీలకూ అగ్నిపరీక్ష: పట్టణ ఓటరు ఎవరి వైపు?
- పేయిడ్ హాలిడేతో ఓటర్లకు ఊరట: ఉద్యోగులు, కార్మికులకు సెలవు
- మక్తల్‌లో విషాదం: బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య, 6వ వార్డు ఎన్నిక రద్దు
- 52 లక్షల మంది ఓటర్లు, 8,195 పోలింగ్ కేంద్రాలు: భారీ ఏర్పాట్లు
- మహిళా ఓటర్లే ఎక్కువ: పుర ఎన్నికల్లో కీలకంగా మారిన మహిళా శక్తి
- పకడ్బందీ బందోబస్తు: 100% వెబ్‌కాస్టింగ్‌తో పోలింగ్ నిఘా
- ప్రచార యుద్ధం ముగిసింది: ఓటర్ల తీర్పే రాజకీయ దిశానిర్దేశం
- ఫలితాలపై ఉత్కంఠ: ఈ నెల 13న తేలనున్న పురపాలకుల భవితవ్యం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో 'పుర' సమరానికి వేళయింది. ఇంకొన్ని గంటల్లో ఏడు కార్పొరేషన్లు.. 116 మున్సిపాలిటీల్లో ఎన్నికల పోలింగ్ మొదలుకానుంది. ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్న ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మొగ్గు చూపుతారు.? రాష్ట్ర రాజకీయాలను శాసించే ఈ ఎన్నికల్లో పట్టణ, నగర ప్రజలు ఏ పార్టీ, అభ్యర్థిని ఆదరిస్తారనేది సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది. పార్లమెంట్ నుంచి సర్పంచ్ వరకు కారు స్పీడుకు కళ్లెం వేసి.. రాష్ట్రంలో ఎదురులేని శక్తిగా అవతరించిన అధికార కాంగ్రెస్ ఎన్ని పురపాలికలను దక్కించుకుంటుదో..కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అంటూ ప్రచారం నిర్వహించిన బీజేపీ ఈ ఎన్నికల్లో ఎన్ని 'పుర' మిగతా 02లో

## నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు

### మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు



- బీఆర్ఎస్.. ఇప్పటికీ అదే పనిచేస్తోంది
- నేను కాన్ఫరెన్స్ కాల్‌లో ఏం మాట్లాడానో ఆ పార్టీ నేతలకు ఎలా తెలుస్తుంది?

03

## ప్రభుత్వ ఉద్యోగులపై నిర్లక్ష్యమేల?

### రూ.2.5 కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ లో రూ.12వేల కోట్ల బకాయిలు చెల్లించలేరా?

- డీఏలు, పీఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించండి
- గ్రాట్యుటీ, ఈపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలనూ చెల్లించలేదు
- 61 మంది రిటైర్డ్ ఉద్యోగుల మృతికి ప్రభుత్వమే కారణం
- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ

03






## భారత్ - పాకిస్తాన్ ఢీ

### మెన్ బ్లూతో ఆడేందుకు దాయాదీ అంగీకారం

- మిత్ర దేశాల చర్చలు, విజ్ఞప్తులు
- సుదీర్ఘ చర్చల అనంతరం పాక్ యూ టర్న్
- 15న కొలొంబోలో హై ఓల్టేజ్ మ్యాచ్

11

## అమెరికాను బీట్ చేసిన భారత్

### అగ్రరాజ్యానికి షాక్

10

- ఐఎంఎఫ్ అంచనాల్లో భారత్ దూసుకుపోతోంది
- ప్రపంచ మాంద్యానికి మధ్య భారత ఆర్థిక దృఢత్వం
- అమెరికా వాటా తగ్గింపు.. ఆసియా ప్రభావం పెంపు
- చైనా-భారత్ కలిపి 43.6% కాంట్రిబ్యూషన్
- పవర్ బ్యాలెన్స్ షిఫ్ట్‌లో భారత్ కీలక పాత్ర




## హైదరాబాద్‌లో భూకంపం

### స్వల్పంగా కంపించిన భూమి



- గాజులరామారం, మెట్‌ఖాన్‌గూడలో భారీ శబ్దంతో భూకంపం
- భయంతో బయటికి పరుగులు పెట్టిన జనం

03

## మరింత అభివృద్ధికి కాంగ్రెస్‌ను గెలిపించాలి

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం
- రాష్ట్ర ప్రభుత్వంతోనే గల్లీ సమస్యల పరిష్కారం
- తెలంగాణపై వివక్ష చూపుతున్న కేంద్ర ప్రభుత్వం

09



# 'రేవంత్ ఖాన్'

### ఎంఐఎంతో దోస్తీ చేసినన్ని రోజులు నిప్పులు పోస్తూనే ఉంటాం

- సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి ఫైర్
- వ్యక్తిగత దూషణలు మానాలని హెచ్చరించిన కిషన్ రెడ్డి
- కేసీఆర్ దత్తపుత్రుడని పిలవడంపై ఆగ్రహం
- కేసీఆర్-రేవంత్ వివాదంలోకి నన్ను తేయొద్దని హెచ్చరిక

03





మాయాబజార్
(Prime Video)

తెలుగు సినిమా చరిత్రలో నిలిచిపోయే దృశ్యకావ్యం. పాత కాలపు టెక్నాలజీతోనే అద్భుతమైన గ్రాఫిక్స్, నటనతో ఈ సినిమా ఇప్పటికీ ప్రేక్షకులను మెప్పిస్తుంది.


# నేడే ఓటర్ డే



(మొదటి పేజీ తరువాయి)
పీఠాలపై కాషాయ జెండా ఎగురవేస్తుంది..? వరుస ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల్లో చతికిల పడ్డ ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కనీసం ఈ ఎన్నికల్లోనైనా తన పట్టు నిలుపుకుని ఉనికిని కాపాడుకుంటుందా..? అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో హైదరాబాద్ మినహా ఎక్కడా పోటీ చేయని ఎంఐఎం.. ఈ సారి కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పోటీ చేయడం ఏ పార్టీకి కలిసొచ్చే అంశంగా మారుతుంది..? ఈ ఎన్నికల్లో మజ్లీస్... ఎక్కడెక్కడ ఎన్నెన్ని స్థానాల్లో గెలుపుబావుటా ఎగురవేస్తుంది..? అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో అధికార పార్టీతో జతకట్టి.. ఈ సారి దూరమైన సీపీఐ ఓటు బ్యాంకు ఏ పార్టీ అభ్యర్థుల ఖాతాలో జమా అవుతాయి..? పలు కారణాలతో బీఆర్ఎస్, పార్టీకి రాజీనామా చేసి.. ఈ ఎన్నికల్లో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఓటర్లు ఏ మేరకు విశ్వసిస్తారూ..? అని రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగరాలు, మున్సిపాలిటీల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది. రాష్ట్రంలో మొత్తం కార్పొరేషన్లు, పట్టణాల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లతో పాటు ఎంఐఎం సైతంఈ ఎన్నికల్లో అత్యధిక సీట్లు కైవసం చేసుకునేలా సర్వశక్తులొడ్డాయి. ఒకరికి మించి మరొకరు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటూ రాష్ట రాజకీయాలనూ ఆకర్షించాయి. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బహిరంగ సభల్లో ప్రసంగించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ర్యాలీలలో పాల్గొని బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ తరపున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎంపీలు ఎన్నికల ర్యాలీల్లో పాల్గొన్నారు. మరోవైపు జనసేన అభ్యర్థులు ప్రచారం చేశారు. వారి తరఫున కొందరు సినిమా నటులు ప్రచారంలో పాల్గొన్నారు. ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రచారం పాల్గొంటారనుకున్నా.. తర్వాత రద్దు అయింది. దీంతో ప్రధాన పార్టీల విమర్శలు, ప్రతివిమర్శలతో ఓటర్లు ఎవరిని విశ్వసిస్తారనే ఉత్కంఠ నెలకొన్నది. దీనికి తోడు అన్ని పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులూ ఓటర్లను ఆకర్షించేలా సొంతంగా తమ మేనిఫెస్టోలు సిద్ధం చేసి ప్రచారం నిర్వహించారు. వీటికి తోడు ప్రచారంలో భాగంగా తెలంగాణలో సుడిగాలి పర్యటన చేయడం, సభలు, సమావేశాలు, రోడ్ షోలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు.. ఎన్నికల్లో ఏ పార్టీ తాను లక్ష్యంగా పెట్టుకున్న సీట్లు గెలచుకోవాలంటే రాష్ట్రంలో ఓటింగ్‌శాతం పెరిగే అవకాశం ఉంది. మొత్తానికి ఉత్కంఠరేపిన ఈ ప్రచారపోరులో ఓటింగ్ శాతం ఏ మేరకు పెరుగుతుంది..? ఓటర్లు ఏ పార్టీకి జైకొడతారో వేచి చూడాలి. నేడు రాష్ట్రంలోని ఏడు నగరపాలికలు, 116 పురపాలికలు కలిపి మొత్తం 123 మున్సిపల్, కార్పొరేషన్ల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఈ నెల 13న ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించేందుకు సిద్ధం అయ్యారు. వీరిలో 25,62,639 మంది పురుష ఓటర్లు కాగా.. మహిళా ఓటర్లు 26,80,014 మంది ఉన్నారు. సాధారణంగా ఏ ఎన్నికల్లో అయినా మహిళల కంటే పురుషుల ఓటర్ల సంఖ్య అధికంగా ఉంటుంది. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. మరోవైపు.. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ మున్సిపల్ ఎన్నికల కోసం ఏకంగా 16,031 బ్యాలెట్ బాక్స్‌లను రెడీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. వీరితో పాటు 1,547 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ కోసం 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు.. 31,428 మంది ఇతర సిబ్బంది మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత.. బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేశారు. మరోవైపు.. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసింది.

**కార్మికులు, ఉద్యోగులకు పేయిడ్ హాలిడే**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా నేడు 'పెయిడ్ హాలిడే' (వేతనంతో కూడిన సెలవు)గా ప్రకటిస్తూ కార్మిక శాఖ మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని అన్ని ఫ్యాక్టరీలు, దుకాణాలు, వాణిజ్య సంస్థలు, పారిశ్రామిక సంస్థలలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులందరికీ ఈ సెలవు వర్తిస్తుందని ప్రకటించింది. తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ (1974), తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ (1988) ప్రకారం ప్రభుత్వం పెయిడ్ హాలీడేను ప్రకటించింది. పోలింగ్ సజావుగా సాగేందుకు, ఉద్యోగులకు సెలవు అమలయ్యేలా చూడాలని కార్మిక శాఖ కమిషనర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్, అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చిన అన్ని మున్సిపాలిటీల పరిధిలో ఈ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు.

**పకడ్బందీ ఏర్పాట్లు : డీజీపీ శివధర్ రెడ్డి**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని చెప్పారు. 1,183 లైసెన్స్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామని, 4318 మందిని బైండోవర్, 398 నాన్–బెయిలబుల్ వారెంట్లు జారీ చేశామన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోసం 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్టంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్ పోస్టులు , 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశామన్నారు. 167 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్ విధుల్లో ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.1.29 కోట్ల నగదు, రూ. 1.21 కోట్ల విలువైన మద్యం, రూ.15.7 లక్షల డ్రగ్స్, 28.69 లక్షలకు పైగా విలువ కలిగిన బంగారం, ఇతర విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,203 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని బందోబస్తు కోసం ఇతర శాఖల నుంచి 3 వేల అదనపు బలగాలను సిద్ధం చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు.

**సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై నిఘా:**
రాష్ట్రంలో 1302 హైపర్ సెన్సిటీవ్, 4975 నార్మల్, 1,926 సెన్సిటీవ్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ పోలీసులు 8,203 పోలింగ్ స్టేషన్లకు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. బందోబస్తు కోసం టీజీఎస్పీ, ఫారెస్ట్, ఎక్సైజ్, సీఐడీ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల నుండి 3,000 మంది బలగాలు సమకూర్చినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో 100 శాతం వెబ్‌కాస్టింగ్, అలాగే హైపర్ సెన్సిటీవ్ పోలింగ్ స్టేషన్ల బయట కూడా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని 9 ఫిబ్రవరి 2026 సాయంత్రం 5 గంటల నుండి సైలెంట్ పీరియడ్ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**మక్తల్ లో ఆరో వార్డు ఎన్నిక రద్దు..**
నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో 6వ వార్డు నుంచి బరిలో ఉన్న బీజేపీ అభ్యర్థి ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వార్డు ఎన్నికను రద్దు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శివయ్య ప్రకటించారు. మరోవైపు మహదేవప్ప ఆత్మహత్యపై విచారం వ్యక్తం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అతని మరణానికి కాంగ్రెస్ పార్టీ అహంకార రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణమని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మక్తల్‌లో బిజెపి ర్యాలీ విజయవంతం కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓర్వలేక, బిజెపి అభ్యర్థులకు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయని. ఈ మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని ఆయన అన్నారు. ఈ ఘటనపై కేంద్రమంత్రి బండిసంజయ్ సైతం స్పందించారు. మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్యని ఆరోపించారు. ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ను రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోందని.. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా? ఎన్నికల తరువాత కాంగ్రెస్ పై యుద్ధం చేయబోతున్నామన్నారు. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయని.. బీజేపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు.

**డీపీజీ కార్యాలయం వద్ద ఆందోళన**
మహదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ నేతలే కారణమని ఆరోపిస్తూ టీబీజేపీ నేతలు మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ తీవ్ర గందరగోళం తలెత్తింది. బీజేపీ నేతలు డీజీపీ ఆఫీస్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఆందోళనకారులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం చెలరేగింది.ఈ క్రమంలో ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహదేవప్ప మృతిపై డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్టు తమకు ఫిర్యాదు వచ్చిందని.. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

**స్కూళ్లకు సెలవు..**
ఎన్నికలు జరగనున్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో ఉన్న స్కూళ్లకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో పోలింగ్ జరగనున్న ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సెలవు ప్రకటించారు. పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలకు సైతం ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**పోలింగ్ స్టేషన్లకు చేరిన బ్యాలెట్ బాక్సులు**
మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామగ్రి అంతా పోలింగ్ స్టేషన్లకు చేరుకుంది. మంగళవారం ఉదయం నుంచి జిల్లాల్లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుంచి సిబ్బంది సామగ్రి తీసుకొని కేంద్రాలకు చేరుకున్నారు.





# నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్ రెడ్డి

## ఓటు హక్కును వినియోగించుకోనున్న ముఖ్యమంత్రి

**ముద్ర, కొడంగల్:**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు వికారాబాద్ జిల్లా కొడంగల్‌కు రానున్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో తన బాధ్యతను నిర్వర్తించుతూ ఆయన స్వయంగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.
ఉదయం 11.30 గంటలకు కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని సీఎం ఓటు వేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన ఇప్పటికే పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అదే విధంగా, తాను కూడా ఓటు వేసి ప్రజలకు ఒక ఉదాహరణగా నిలవాలని సీఎం నిర్ణయించినట్లు సమాచారం.
ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా కొడంగల్‌లో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.
మున్సిపల్ ఎన్నికలు స్థానిక పరిపాలనకు కీలకమైనవిగా భావిస్తున్న ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో బలమైన స్థానిక సంస్థలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. సీఎం ఓటింగ్ కార్యక్రమం ప్రజల్లో ఓటు ప్రాధాన్యతపై మరింత అవగాహన పెంచుతుందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## రష్యా ఆయిల్ కొనకపోతే
# నష్టం ఎవరికి?




**ముద్ర, నేషనల్ డెస్క్:**
భారత్–అమెరికా మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో భారత్‌పై అమెరికా టారిఫ్‌లు 18 శాతానికి తగ్గాయి. ఇక అదే సమయంలో అమెరికా భారత్‌పై మరో ఒత్తిడి పెంచింది. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు తగ్గించాలని ఆదేశించింది. భారత్‌తో సంబంధం లేకుండానే డొనాల్డ్ ట్రంప్.. భారత్ రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గిస్తోందని ప్రకటించారు. అయితే దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయలేదు. మంత్రి పీయూష్ గోయల్ మాత్రం రష్యా ఆయిల్ కొనుగోలు ట్రేడ్‌లో భాగం కాదని ప్రకటించారు.

**తగ్గిన రష్యా ఆయిల్ దిగుమతి..**
ఇదిలా ఉంటే భారత్‌కు రష్యా ఆయిల్ దిగుమతి తగ్గింది. 2024 డిసెంబర్‌తో పోల్చితే 2025లో 15% తగ్గుదల నమోదైంది. నవంబర్–డిసెంబర్ మధ్య 27% తగ్గుదల.నమోదైంది. ఇక ఇదే సమయంలో అమెరికా దిగుమతులు 31% పెరిగాయి. దీంతో భారత్ అమెరికా ఒత్తిడికి తలొగ్గుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**షిప్పింగ్ భారం మూడురెట్లు..**
రష్యా, ఇరాన్ నుంచి బ్యారెల్ ఆయిల్ రవాణాకు షిప్పింగ్ చార్జి ఒక డాలర్ ఖర్చు అయ్యేది. అమెరికా, వెనెజువెలా నుంచి రవాణ చేయడానికి 3 నుంచి 5 డాలర్లవరకు కర్చు చేయాల్సి వస్తుంది. దీంతో భారత్‌పై రవాణా భారం మూడు రెట్లు పెరుగుతుంది. ఇక రష్యా, ఇరాన్ నుంచి భారత్ రూపాయల్లోనే ఆయిల్ కొనుగోలు చేస్తోంది. అమెరికా నుంచి కొనాలంటే డాలర్లలో కొనాలి. రష్యా రూపాయలను భారత్‌లోనే పెట్టుబడి పెట్టేలా రిజర్వు బ్యాంకు అవకాశం కల్పించింది. దీంతో మన దేశంలో పెట్టుబడులు పెరిగాయి.

**డాలర్ ఒత్తిడి..**
డాలర్‌లో కొనుగోళ్లు రూపాయి విలువపై ఒత్తిడి పెంచుతాయి. రష్యా వ్యవస్థ ఉపాధి అవకాశాలు, ఆర్థిక ప్రవాహాన్ని పెంచుతుంది. అమెరికా మార్పు దీర్ఘకాలిక ఖర్చులు పెంచి, ఆర్థిక సమతుల్యాన్ని భంగపరుస్తుంది.

**ఆయుధాల కొనుగోలుపై ప్రభావం..**
ఆయిల్ మార్పు భవిష్యత్ ఆయుధ కొనుగోళ్లలో అమెరికా ఒత్తిడికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఆంక్షల్లా రష్యా మార్పు భారత వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని పరిమితం చేస్తుంది. చైనా, యూరప్ కొనుగోళ్లు కొనసాగుతుంటే భారత్ పై మాత్రమే అమెరికా ఒత్తిడి చేయడం గమనార్హం.

# కార్పొరేట్ పాఠశాలలో 'టీ'చకుడు!

సమాజంలో గురువుకు ఉన్నతమైన స్థానం ఉంది. గురువు లేని విద్య వ్యర్థం. మనం ఏం నేర్చుకున్నా గు రువు ఉండాలి. ఇక చదువు విష యంలో తప్పనిసరి. గురువే భవిష్య త్‌కు బాటలు వేసేది. అందుకే టెక్నా లజీ ఎంత పెరిగినా గురువుల గౌర వం తగ్గడం లేదు. కానీ, కొందరు 'టీ'చకుల కారణంగా గురువుల గౌరవం మంటగలుస్తోంది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన బడిలో కామాంధులుగా మారుతున్నారు. అమ్మాయిలతో అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. లైంగికదాడులు చేస్తున్నా రు. తాజాగా ఓ కార్పొరేట్ పాఠశాలలో మరో టీచకుడి బాగోతం బట్టబయలైంది.

**మాయ మాటలతో పెళ్లిళ్లు..**
హైదరాబాద్ పోచారం ఐటీ కారిడా ర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో ఉపాధాయయుడు పర్రె మైటీన్ పదో తరగతి విద్యార్థినిని లైంగికంగా వేధించా డు. రహస్యంగా పెళ్లి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థిని మెడలో పసుపు తాడు గమనించిన తల్లిదండ్రులు షాక్ అయ్యారు.

**తండ్రి ఫిర్యాదుతో కేసు..**
విద్యార్థిని తండ్రి ఫిర్యాదుతో పోలీ సులు రంగంలోకి దిగారు. టీచకు డు పర్రె మైటీస్‌పై పోక్సో చట్టం కిం ద కేసు నమోదు చేశారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన 20 రోజుల క్రితం జరిగింది. పాఠశాల యాజమాన్యం విషయం బయటకు రాకుండా గోప్యంగా ఉం చింది. తాజాగా టీచకుడి అరెస్ట్‌తో వెలుగులోకి వచ్చింది.

**విద్యార్థినుల భద్రతపై ఆందోళన..**
ఈ ఘటన పాఠశాలల్లో మానిటరింగ్ లోపాలను బహిర్గతం చేసిం ది. గురువగా భావిస్తున్న ఉపాధ్యా లు.. విద్యార్థినుల బలహీనతను త మకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు, యాజమాన్యాలు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నాయి. ఇక తల్లిదండ్రులు కూడా విద్యార్థినుల ప్రవర్తనలపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ

## అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలింపు



**ముద్ర, హైదరాబాద్ :**
మాదాపూర్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న వినయ్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీ బీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీ నిర్వాహకుడు యూసఫ్‌గూడకు చెందిన మహిళకు నగదు ఇవ్వాలి. డబ్బు ఇవ్వకపోగా వేధిస్తుండటంతో సదరు మహిళ ఇటీవల మాదాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై ఎస్సై గండ్ర వినయ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుడిగా ఉన్న వ్యక్తి కోర్టును ఆశ్రయించగా.. అతనికి నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ ఎస్సై రూ.లక్ష లంచం డిమాండ్ చే శారు. రెండు విడతలుగా నగదు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. అనంతరం బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు మాదాపూర్ ఠాణా సమీపంలోని నీరూస్ జంక్షన్ వద్ద బాధితు డు.. ఎస్సైకి రూ.50వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్సైని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు

సీతారామం (Amazon Prime/ Hotstar) ఇదొక అందమైన ప్రేమ కావ్యం. యుద్ధం నేపథ్యంగా సాగే రామ్, సీతల ప్రేమకథ గుండెల్ని హత్తుకోవడమే కాకుండా విజువల్ గా కూడా చాలా బాగుంటుంది.



# హైదరాబాద్ లో భూకంపం

- స్వల్పంగా కంపించిన భూమి
- గాజులరామారంలోని మెట్‌ఖాన్‌గూడా భారీ శబ్దాలు
- భయంతో బయటికి పరుగులు పెట్టిన జనం

ముద్ర, హైదరాబాద్ :



హైదరాబాద్‌లో భూమి కంపించింది. దీంతో జనం భయంతో పరుగులు తీశారు. భారీ శబ్దంతో భూమి కంపించినట్లు అనిపించడంతో.. స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. నగరంలోని గాజురామారంలో భూమి కంపించినట్లు అక్కడి ప్రజలు పేర్కొన్నారు. అయితే ఇది భూకంపానికి సంబంధించిన ప్రకంపనలా కాదా అనేది ఇంకా తేలాల్సి ఉంది. రంగంలోకి దిగిన అధికారులు ఎలాంటి నష్టం సంభవించలేదని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం ఉదయం 10:10 గంటల సమయంలో.. గాజులరామారంలోని మెట్ ఖాన్‌గూడా ప్రాంతంలో భూమి కంపించింది. రెప్పపాటులో జరిగిన ఈ ఘటనతో ఇళ్లలోని వస్తువులు కదిలిపోవడంతో పాటు, కొన్ని చోట్ల నేలపై పడిపోయాయి. దీంతో భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపై గుమిగూడారు. భూకంప భయంతో స్థానికంగా ఉన్న పలు విద్యా సంస్థలు అప్రమత్తమయ్యాయి. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూల్ యాజమాన్యాలు తక్షణమే సెలవులు ప్రకటించాయి. మెట్ ఖాన్ గూడలోని ప్రభుత్వ పాఠశాలలో బెంచీలపై ఉన్న జ్యామెట్రీ బాక్సులు కిందపడినట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపారు. మెట్ ఖాన్ గూడలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో భూకంపానికి సంబంధించిన దృశ్యాలు సెక్యూరిటీ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీడియోల్లో భూమి కంపించడంతో పాటు వస్తువులు కదిలినట్లు స్పష్టంగా కనిపించాయి. అయితే ఇది నిజంగా భూకంపమేనా? లేక ఎక్కడైనా పేలుడు పదార్థాలతో వచ్చిన శబ్దమా? అన్న సందేహాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇప్పటివరకు మెట్ ఖాన్‌గూడ ప్రాంతంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికులు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. శబ్దం, భూమి కంపించడం ఒకేసారి రావడంతో.. ఇది నిజంగానే భూ ప్రకంపనలతో జరిగిందా.. లేక ఎవరైనా కావాలని ఇలా చేశారా అనే దానిపై అధికారులు అక్కడి స్థానికుల ద్వారా ఆరా తీశారు. ఇప్పటివరకు అధికారికంగా భూకంపమని ధ్రువీకరించే ప్రకటన విడుదల కాలేదు.



# నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు..

- నేను కాన్ఫరెన్స్ కాల్‌లో ఏం మాట్లాడానో ఆ పార్టీ నేతలకు ఎలా తెలుస్తుంది..?
- ఫోన్ ట్యాపింగ్ పరికరాలు ఎక్కడెక్కడ..?
- ఎన్నెన్ని ఉన్నాయో లెక్క తేలుస్తాం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

ముద్ర, ఖమ్మం :

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఇప్పటికీ జరుగుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఫోన్ పరికరాలు ఇంకా బీఆర్ఎస్ నేతల వద్ద ఉన్నట్లు అనిపిస్తోందని ఆరోపించారు. లేకుంటే తాను కాన్ఫరెన్స్ కాల్‌లో ఏం మాట్లాడానో ఆ పార్టీ నేతలు ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందన్నారు. ఇంకా ఎన్ని పరికరాలు ఏయే మామిడితోటలు, ఫామ్ హౌస్‌లు, ఇళ్లలో ఉన్నాయో? ఫోన్ కాల్స్ ఇంకా ఎంత మంది వింటున్నారో ఎంక్వైరీ చేసి అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు అధికారంలో ఉండగా బెదిరింపులకు పాల్పడిన వారికి... తాము ఓట్లు అడుగుతుంటే బెదిరింపులకు పాల్పడినట్లు భావన కలుగుతోందని విమర్శించారు. సామాన్య ప్రజలకు హక్కు ఉన్నట్లుగానే ఉద్యోగులకు కూడా తమ ఓటును వినియోగించుకునే హక్కు ఉందన్నారు. అధికారులను ఓటు అడగడంలో తప్పేముందని నిలదీశారు. సీఎం రేస్‌లో తాను లేనని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను అనేక సందర్భాల్లో చెప్పానని చెప్పారు. తాను పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను మాత్రమేనని వివరణ ఇచ్చారు. తాను సీఎం రేస్ లో ఉన్నట్లు కొందరు వ్యాఖ్యలు చేస్తున్నారనీ... ఈ విషయంలో ఎవరి అభిమానం వారిదని అన్నారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల పెంపు, తగ్గింపు లేదని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారన్న పొంగులేటి.. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల ఏర్పాటుపై ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆ కమిటీ ఇచ్చే నివేదికను అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కనీసం ఈ చర్చకైనా కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టబోతున్నారని గ్రహించిన కేటీఆర్.. అదే భంగపాటుతో సీఎంరేవంత్ రెడ్డి, మిగతా ముఖ్య నేతలపై నోరుపారేసుకుంటున్నారని మంత్రి మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలోనూ చాలెంజ్‌లు చేసి, రెఫరెండమని మాట్లాడి భంగపడ్డారన్నారు. మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ గెలవబోతోందనే బీఆర్ఎస్ నేతలు సైలెంట్ అయ్యారన్నారు. నేడు జరగనున్న ఎన్నికల్లో 80 శాతానికి పైగా మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్లుగా పేదవాడికి అండదండగా నిలిచేలా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి చేస్తోందని మంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని అద్భుతమైన పాలసీలు తీసుకువచ్చి విద్యా, వైద్యానికి ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు నిరుద్యోగులకు 71 వేల ఉద్యోగులకు ఇచ్చామన్న ఆయన రైతులకు రుణమాఫీ, రైతుభరోసా ఇస్తూ రైతులను రాజును చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా అన్ని రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చెల్లాచెదురు చేస్తే తాము వచ్చి ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ వస్తున్నామన్నారు.

# రేవంత్ ఖాన్ ఎంఐఎంతో మిలాఖత్

- సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్
- వ్యక్తిగత దూషణలు మానాలి
- కేసీఆర్ దత్తపుత్రుడని పిలవడంపై ఆగ్రహం
- కేసీఆర్–రేవంత్ వివాదంలోకి నన్ను లాగొద్దని హెచ్చరిక

ముద్ర, న్యూఢిల్లీ :

కాంగ్రెస్ తెలంగాణలో ఎంఐఎంతో కాపురం చేసినన్ని రోజులు ఆ పార్టీ, నేతలపై నిప్పులు పోస్తూనే ఉంటామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో మాట్లాడిన ఆయన 'సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు దిగారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన సభల్లో తన పేరు, ఇంటి పేరు మార్చి తనను కేసీఆర్ కు దత్త పుత్రుడు అంటూ పిలుస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే తమపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదన్న ఆయన అంత సరదాగా ఉంటే మీరు రేవంత్ ఖాన్‌గా పేరు మార్చుకోండని సూచించారు. రేవంత్ పేరు మార్చుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. మాకు తల్లిదండ్రులు పెట్టిన పేరు మార్చడానికి మీరు ఎవరు? కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఎవరికీ దత్తపుత్రుడిని కాదన్న కిషన్ రెడ్డి.. కేసీఆర్‌కు మీకు ఏదైనా ఉంటే.. మీరు మీరు తేల్చుకోండి. మీ విమర్శల మధ్యలోకి నన్ను లాగకండి అని వ్యాఖ్యానించారు.



# భయపెడితే ఓట్లేయరు..

- ఖమ్మం గడ్డపై కాంగ్రెస్ 'రాక్షస' రాజకీయం
- అభివృద్ధి శూన్యం - అరాచకం అపారం
- కాంగ్రెస్ మంత్రుల తీరుపై బీఆర్ఎస్ నిప్పులు!

ముద్ర ప్రతినిధి, ఖమ్మం :

ఖమ్మంలో అరాచక పాలన సాగిస్తున్నారని, భయపెట్టి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని, భయపెడితే ఎవరూ ఓట్లు వేయరని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం బీఆర్ ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పాలేరు, వైరా మాజీ ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, బానోత్ చంద్రావతి, డీసీసీబీ మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ఒకవైపు.. వంచన చేస్తున్న కాంగ్రెస్ మరోవైపు ఉందని అన్నారు. ఓటు వేయకపోతే బొక్కలో వేస్తాం అని మంత్రి స్థాయి వ్యక్తి ఓటర్లను బెదిరించడం అత్యంత దారుణమని అన్నారు. పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను అడ్డం పెట్టుకుని బి.ఆర్.ఎస్ కార్యకర్తలను, నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఏజెంట్లుగా మారుతున్న అధికారులపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. వారిని తక్షణమే విధులనుంచి తప్పించాలని, ఓటమి భయంతోనే రాత్రికి రాత్రే ప్రలోభాలు పెట్టి పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.., "గత పది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న వంచనను, అధికార పార్టీ నేతల అక్రమాలను ఎండగడుతూ బి.ఆర్.ఎస్ పార్టీ నేతలు నేడు ఘాటుగా స్పందించారు. కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అద్భుతమైన అభివృద్ధికి, ప్రస్తుత కాంగ్రెస్ అరాచక పాలనకు మధ్య ఉన్న తేడాను గమనించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ జిల్లాలో ముగ్గురు మంత్రులు తాము చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక నిస్సహాయ స్థితిలో ఉన్నారని బి.ఆర్.ఎస్ నేతలు విమర్శించారు. ఓటమి భయంతో పోలీసు మరియు రెవెన్యూ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని బి.ఆర్.ఎస్ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాత్రికి రాత్రే ప్రలోభాలకు గురిచేస్తూ నాయకులను పార్టీలో చేర్చుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ఒక మంత్రి, "ఓటు వేయకపోతే బొక్కలో వేస్తాం" అంటూ ఓటర్లను, ప్రతిపక్ష నేతలను




బహిరంగంగా బెదిరించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శించారు. "ఇదేనా మీరు నేర్చుకున్న సంస్కృతి?" అని మంత్రులను నిలదీశారు. గతంలో కేసీఆర్ కేబినెట్‌లో పనిచేసిన మంత్రులు నేడు వ్యవస్థలు ధ్వంసమయ్యాయని మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. "అనాడు భక్త రామదాసు ప్రాజెక్టు కట్టింది మీరు కాదా? అప్పుడు వ్యవస్థలు పని చేయలేదా?" అని ప్రశ్నించారు. పాలేరులో మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి తెచ్చిన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజ్, నర్సింగ్ కాలేజీలకు ఇప్పుడు రిబ్బన్లు కట్ చేయడం తప్ప, ఈ మంత్రులు జిల్లాకు కొత్తగా తెచ్చింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో ప్రజలను మభ్యపెడుతూ మధిర పట్టణాన్ని 'మినీ సింగపూర్' చేస్తామన్న మాటలు కోటలు దాటుతున్నాయి కానీ, క్షేత్రస్థాయిలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. అసమర్థ పాలనను కప్పిపుచ్చుకోవడానికి అబద్ధపు హామీలతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. రెవెన్యూ మంత్రి స్వయంగా ఉద్యోగ సంఘాల నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, వార్డుల వారీగా ఓట్ల సమీక్ష చేయడంపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ కాంగ్రెస్ ఏజెంట్లుగా మారుతున్న అధికారులపై జిల్లా కలెక్టర్ కు మరియు ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రకటించారు. అటువంటి అధికారులను వెంటనే ఎన్నికల విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపాలిటీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బుల్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నాయకులు ముత్యాల వెంకటప్పారావు, బలుసు మురళీకృష్ణ, బంక మల్లయ్య, పగడాల నరేందర్, మహమ్మద్ రఫీ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులపై నిర్లక్ష్యమేల..?

- రూ.2.5 కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ లో రూ.12వేల కోట్ల బకాయిలు చెల్లించలేరా..?
- డీఏలు, పీఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించండి
- గ్రాట్యుటీ, ఈపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలనూ చెల్లించలేదు
- 61 మంది రిటైర్డ్ ఉద్యోగుల మృతికి ప్రభుత్వమే కారణం
- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ

ముద్ర, తెలంగాణ బ్యూరో:



రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలను తక్షణమే చెల్లించాలని మంగళవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో 3 లక్షలకు పైగా రెగ్యులర్, 4 లక్షలకు పైగా రిటైర్డ్ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగులు దాచుకున్న గ్రాట్యుటీ, ఈపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని మండిపడ్డారు. 2023 జులై నుండి అమలు చేయాల్సిన పీఆర్సీని రెండున్నరేళ్లు అవుతున్నా ఆ ఊసే ఎత్తకపోవడం శోచనీయం అన్నారు. కనీసం పీఆర్సీ రిపోర్ట్ ను కూడా తెప్పించకపోవడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులంటే ఎంతటి నిర్లక్ష్య వైఖరి ఉందో అర్థం చేసుకోవచ్చని దుయ్యబట్టారు. రిటైర్డ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వమే మానసిక వేదనకు గురిచేస్తుండటం క్షమించరానిదన్నారు. ముక్కు మొఖం తెలియని వృద్ధులు కష్టాల్లో ఉంటేనే చేతనైనంత సాయం చేయాలని భావించే గొప్ప మానవతా హృదయమున్న తెలంగాణ సమాజం మనది అన్నారు. అలాంటింది జీవితాంతం ప్రభుత్వానికి ఊడిగం చేసిన ఉద్యోగులు రిటైర్డ్ అయితే వారి బెన్‌ఫిట్స్ అన్నీ చెల్లించి సగౌరవంగా సన్మానించి పంపాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ వారి ఉసురు పోసుకుంటోందని విమర్శించారు. మానవత్వం ఉన్న పాలకులెవరూ ఇంతటి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించరని సూచించారు. మీ నిర్లక్ష్యంతో బెన్‌ఫిట్స్ అందక గత ఏడాది నుండి ఇప్పటి వరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర మానసిక వేదనకు లోనై మరణించారని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగులతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయలకు చెల్లించాల్సిన బకాయిలన్నీ కలిపితే రూ.12 వేల కోట్లకుపైగా ఉన్నట్లు తెలుస్తోందని బండి సంజయ్ అభిప్రాయపడ్డారు. ఏటా రూ.2.5 లక్షల కోట్లకు పైగా వార్షిక బడ్జెట్ కలిగిన రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.12వేల కోట్ల బకాయిలు చెల్లించడం భారంగా భావించడం అంటే అంతకంటే దురదృష్టకరమైన విషయం మరొకటి లేదన్నారు. ఇకనైనా వారిపట్ల మీకున్న నిర్లక్ష్య ధోరణిని విడనాడి రిటైర్డ్ ఉద్యోగుల బెన్‌ఫిట్స్ బకాయిలను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే మున్సిపల్ ఎన్నికల్లో అనంతరం రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేసేందుకూ వెనుకాడబోందన్నారు. అవసరమైతే హైదరాబాద్ నడిబొడ్డున ఆయా ఉద్యోగుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చే వరకు దీక్ష చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.



- ఎన్నికల సంఘానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ

# ఎమ్మెల్యే సంజయ్ పై చర్యలు తీసుకోండి

- ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారంటూ ఈసీకి ఫిర్యాదు
- టికెట్ల వివాదం నుంచి ఎన్నికల సంఘం వరకు చేరిన జగిత్యాల రాజకీయ రగడ
- పోలింగ్ ముందు లేఖ...

### పోలింగ్ తర్వాత హాట్ టాపిక్!

ముద్ర,జగిత్యాల :

జగిత్యాల కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మధ్య వైరం తారాస్థాయికి చేరుకున్నది. మున్సిపల్ టికెట్ల విషయంలో ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కలకలం రేపగా ఆ మంటలు ఇంకా చల్లారడం లేదు. తాజాగా ఎమ్మెల్యే సంజయ్ పై జీవన్ రెడ్డి ఈసీకి ఫిర్యాదు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే రాయికల్, జగిత్యాల ప్రాంతాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. బీఆర్ఎస్ తరపున గెలిచిన సంజయ్ ఆ పై కాంగ్రెస్ లోకి రావడంపై గుర్రుగా ఉన్న జీవన్ రెడ్డి ఇప్పుడు ఏకంగా ఈసీకి లేఖ రాయడం సంచలనంగా మారింది. పోలింగ్‌కు ముందు రాసిన ఈ లేఖ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం 11.02.2026

# 4 వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## ఏపీ సమాచారం

### శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్

# ఆ పదవి భర్తీ ఎప్పుడు..?




కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయితే ముందుగా వినిపించే పేరు టీటీడీ చైర్మన్. ప్రభుత్వాల ప్రతిపాదన మేరకు, సిఫారసు మేరకు ఈ పోస్టు నియామకం ఉంటుంది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత టిటిడి చైర్మన్‌గా టీవీ5 అధినేత బి.ఆర్ నాయుడుకు అవకాశం ఇచ్చారు. అయితే టీటీడీకి అనుబంధంగా ఉండే ఎస్వీబీసీ చైర్మన్ పదవి భర్తీ చేయలేదు. అదిగో ఇదిగో అంటూ రెండు సంవత్సరాల కాలం గడిపేశారు. ప్రస్తుతం ఎస్వీబీసీ కూడా బిఆర్ నాయుడు చూస్తున్నట్లు తెలుస్తోంది. కానీ టీటీడీలో ఎస్వీబీసీ ది కూడా ప్రధాన పాత్ర. ఆ పదవి కోసం చాలామంది సినీ ప్రముఖులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. టిడిపి హయాంలో ఈ పదవిని దర్శకుడు రాఘవేంద్రరావు నిర్వర్తించేవారు. వైసీపీ హయాంలో సినీ నటుడు పృథ్వీరాజ్ నియమించబడ్డారు. ఆయనపై ఆరోపణలు రావడంతో కొత్త వ్యక్తికి అప్పగించారు అప్పట్లో. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నియామకం జరగలేదు.తిరుమల తిరుపతి దేవస్థానంలో ఎస్వీబీసీ ఛానల్ ది క్రియాశీలక పాత్ర. స్వామి వారి కార్యక్రమాలు, ఆధ్యాత్మిక భావన కలిగించే రీతిలో ప్రసారాలు ఎస్వీబీసీ ద్వారా ఉంటాయి. అటువంటి ఎస్వీబీసీ పర్యవేక్షణ బాధ్యత చైర్మన్ ది. అది నామినేటెడ్ పదవి. ప్రభుత్వాలు నియమించాల్సి ఉంటుంది. అయితే ఈ పదవి కోసం సినీ ప్రముఖులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే బి ఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు. అందుకే ఎస్వీబీసీ చైర్మన్ పదవి కాపు సామాజిక వర్గానికి ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.ఎస్వీబీసీ చైర్మన్ పదవి కోసం చాలామంది సినీ ప్రముఖులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పదవి కోసం చాలామంది పవన్ కళ్యాణ్ ద్వారా ప్రయత్నిస్తున్నారు. మరికొందరు బాలకృష్ణ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకోవైపు బిజెపి సైతం తమ పార్టీకి ఆ పదవికి కేటాయించాలని కోరుతోంది. అందుకే ఆ పదవి భర్తీలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**- కనపర్తి రవి**

### మీకు తెలుసా? : విమానాలు తెల్లగా ఎందుకుంటాయి

**ఎందుకు ఎక్కువగా విమానాలు తెల్లగా ఉంటాయో తెలుసా? తెల్లరంగు సూర్యకాంతిని ప్రతిఫలింపజేస్తుంది, విమానం చల్లగా ఉండేలా చేస్తుంది, అలాగే శరీరంపై ఒత్తిడి తగ్గిస్తుంది. దీని వల్ల ఎయిర్ కండిషనింగ్ అవసరం తగ్గి, ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. అదనంగా, మెయింటెనెన్స్ సమయంలో పగుళ్లు లేదా నష్టం సులభంగా గుర్తించవచ్చు. ఆకాశంలో తెల్లరంగు వెనుక ఉన్న శాస్త్రం ఇదే!**




# ఓటరా ప్రశ్నించు.. పట్టణ ప్రగతిని సాధించు...




ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. పౌరుల చైతన్యం మీదనే పట్టణ ప్రగతి ఆధారపడి ఉంటుంది. ప్రశ్నించడం అనేది తిరుగుబాటు కాదు.అది బాధ్యతాయుతమైన పౌరుని లక్షణం. ప్రశ్న అభివృద్ధికి మూలం. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం అధికారులతో ప్రజాప్రతినిధులతో ప్రశ్నించినప్పుడే అభివృద్ధికి బీజం పడుతుంది. ప్రజల అవసరాలకు అనుకూలంగా పాలన సాగాలంటే ప్రశ్న శక్తివంతమైన ఆయుధం ప్రశ్నించే గొంతుక ఉన్నచోట ప్రగతి పరుగులు తీస్తుంది. పట్టణాభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు పౌరుల సమిష్టి కృషి జరిగినప్పుడే ఆశించిన సుందర ఆరోగ్యకరమైన నగరాలు నిర్మించుకోగలం.

**సమస్యను ప్రశ్నించు_ పరిష్కారాన్ని సాధించు**

ప్రశ్నలేని చోట ప్రగతి స్తంభిస్తుంది. అభివృద్ధి మందగిస్తుంది.ప్రశ్న ఉన్న చోట ప్రగతి చిగురుస్తుంది. వార్డు /డివిజన్/ కౌన్సిలర్/ కార్పొరేటర్ గా పోటీచేసే అభ్యర్థును ఓటర్లు అడిగే ప్రశ్నలే పట్టణ ప్రగతికి దిక్సూచి.

***ఓటు మన ఆయుధం_ అభివృద్ధి మన లక్ష్యం*.**

పౌర సేవలు ప్రజల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలంటే పాలనలో పారదర్శకత పెరగాలి .ప్రశ్నించడం ద్వారా ప్రజాప్రతి నిధుల్లోపాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది.పట్టణ ప్రగతి సాధ్యమవుతుంది.

***ప్రశ్నించే గొంతుకలే _పట్టణాభివృద్ధికి కంచుకోటలు**

పుర పాలకఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను బాధ్యతాయుతమైన ఓటర్లు ప్రశ్నించండి? ఓట్ల కొరకు వచ్చే అభ్యర్థులను రాబోయే ఐదేళ్ల కాలంలో వార్డు/ డివిజన్/ పట్టణ అభివృద్ధికి ఏ విధమైన కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తారో ప్రశ్నలతో నిలదీయండి.ప్రశ్నించే గొంతుకలే పట్టణాభివృద్ధికి కంచుకోటలు. ఓటర్లు అడిగే ప్రశ్నలే ప్రజాప్రతినిధులకు విధానాల రూపకల్పనకు దిక్సూచిగా పనిచేస్తాయి. పట్టణ ప్రగతికి మార్గదర్శకమవుతాయి.పుర పాలక ఎన్నికల్లో వార్డు/ డివిజన్ /కౌన్సిలర్ /కార్పొరేటర్ గా పోటీచేసే అభ్యర్థులు ఓటర్ల వద్దకు వచ్చినపుడు అభ్యర్థిని నిలదీయండి ?ప్రశ్నించండి ? మీ ప్రశ్నలు భవిష్యత్తు వార్డు డివిజన్ పట్టణ అభివృద్ధికి దశ దిశగా నిలుస్తాయి.

***మౌలిక సదుపాయాల కల్పన**

మౌలిక సదుపాయాల కల్పన వానాకాలంలో వార్డులో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు .కొత్త రోడ్ల నిర్మాణం కోసం అభ్యర్థి దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటి ?వానాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏ విధంగా ఆధునీకరిస్తారు.

★వీధిదీపాలు వెలుగు వార్డ్/ డివిజన్/ పట్టణ పరిధిలో ఎల్ఈడి దీపాల ఏర్పాటుచేసినిరంతరం వెలిగేలా చేసేందుకు ఏ విధమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు ?

★ఆరోగ్యం పరిశుభ్రత చెత్త సేకరణ ప్రతిరోజు క్రమ బద్ధంగా జరిగేలా ఎలాంటి చర్యలు చేపడతారు. పట్టణంలో దోమల నివారణ. పొంగి పొరిలే మురికి కాలువల నిర్వహణ 'కాలవల్లో పేరుకుపోయిన పూడిక తీత' తాగునీటి సమస్యలు' గుంతల మయమైన రహదారులు నిర్వహణ లేని పార్కులువైద్య సేవలు భూగర్భ డ్రైనేజ్ 'నాలాల ఆక్రమణ అడ్డుకోవడం. ప్రభుత్వ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు.

***పట్టణాభివృద్ధి పథకాలు..చట్టాలపై అవగాహన**

స్మార్ట్ సిటీ అమృత్ స్వచ్ఛభారత్ ఆవాస్ యోజన నిర్భయ ఫండ్ లాంటి పథకాలపై అవగాహన ఉందా? వీటికి నిధులు ఏ విధంగా రాబట్టగలుగుతారు.స్థానిక స్వపరిపాలన సాధికారిత సాధనకు మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉందా?

***ప్రజారోగ్యం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగు పరచడం మరియు ఉచితంగా మందులు లభించడానికి తీసుకునే చర్యలు ఏమిటి?

★ప్రజాపంపిణీ పథకం : ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో జరిగే అవకతవకలు అరికట్టి పేదలకు ఆహార వస్తువులను బియ్యం గోధుమలు చెక్కర వినియోగ వస్తువులు సకాలంలో అందించే ఏర్పాటు కొరకు కార్యాచరణ ఉందా? ఆహార భద్రత హక్కు రక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు.

***పబ్లిక్ ఆస్తుల రక్షణకు చర్యలు**

పట్టణంలో ప్రభుత్వభూములు ఎండోమెంట్ భూములు అక్రమ కబ్జాల నివారణకు మీ వద్ద ఉన్న షెడ్యూల్ ఏమిటి?

★ప్రజారోగ్యం వైద్యం ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడం. భస్తీ దవాఖానాల్లో ఆరోగ్య సేవలు ఉచిత మందుల లభ్యత జన ఔషధీ మందులను అందుబాటులో ఉంచడం . సీజనల్ వ్యాధుల నివారణ .దోమలు పందులు కోతులు కుక్కల బెడద నియంత్రణకు అభ్యర్థుల వద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందా? ప్రశ్నించండి?

***ఫిర్యాదులకు ప్రత్యేక బాక్స్**

ప్రజల నుండి ఫిర్యాదుల ఫీడ్ బ్యాక్ కొరకు వాట్సాప్ నెంబర్ అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు సూచించండి.

***మంచినీటి సరఫరా**

తాగునీరు పర్యావరణం .ప్రతి ఇంటికి సరిపడా సురక్షితమైన మంచి నీరు సరఫరా చేయడానికి ప్రతి ఇంట ఇంకుడు గుంతల ఏర్పాటుకు అవలంబించే ప్రణాళిక ఏమిటి? వాడలో ఉన్న పార్కులు ఖాళీ స్థలాలను ఆక్రమణ నుండి కాపాడడం చెట్లను పెంచడం పచ్చదనం పరిశుభ్రతకొరకు అమలు చేసే ప్రణాళిక ఏమిటి?

***రిక్రియేషన్ సౌకర్యాలు.. ప్రణాళిక**

సీనియర్ సిటిజన్స్ యువతకు అనుకూలంగా వార్డ్ డివిజన్ పట్టణ స్థాయిలో వాకింగ్ ట్రాక్స్ ఓపెన్ జిమ్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం రిక్రియేషన్ సౌకర్యాల ఏర్పాటు కొరకు ప్రణాళికలు ఉన్నాయా ప్రశ్నించండి.

***పర్యావరణ కాలుష్య నివారణకు చర్యలు**

చెరువుల కాలుష్యాన్ని అరికట్టడానికి మీరు తీసుకునే చర్యలు ఏమిటి? చెరువుల సంరక్షణ పై ఎలాంటి ప్రణాళికచేపడతారు. వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాటుకు తీసుకునే చర్యలు?

***పురపాలనలో పారదర్శనికత**

పుర పాలనలో పారదర్శకత మరియుజవాబుదారీ తనం మున్సిపాలిటీకి ఆర్థిక సంఘం కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు ఖర్చు వివరాలను ప్రజలకు తెలియ చేయడానికి వార్డు /డివిజన్ స్థాయి ఓటర్ల / ప్రజల పట్టణ సభలు ( గ్రామసభల మాదిరి) నిర్వహిస్తారా ?

***ప్రజలకు అందుబాటులో ఉంటారా?**

ఎన్నికైన వార్డు/ డివిజన్/ కౌన్సిలర్ /కార్పొరేటర్ ఓటర్లకు /ప్రజలకు తమ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయంలో అందుబాటులో ఉండే సమయం నోటీస్ బోర్డ్స్ ప్రకటిస్తారా? గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చారా? (పాత అభ్యర్థి అయితే)

***మహిళల భద్రత**

ప్రజల భద్రత కోసం చేపట్టే చర్యలు ఏమిటి? మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరా లో ఏర్పాటు అసాంఘిక శక్తులపై ఎలాంటి నిఘా ఏర్పాటు చేస్తారు?

***భవన నిర్మాణాల్లో అవినీతి నిర్మూలన**

భవన నిర్మాణ అనుమతుల్లో జరిగే అవినీతి ఎలా అరికడతారు. భవన నిర్మాణాల్లో సింగిల్ విండో సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి

**మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి?**

కాలుష్య రహిత పర్యావరణహిత పరమైన వార్డు/ డివిజన్/ పట్టణాన్నీ / నగరాన్ని ఆరోగ్యవంతమైన సుందర నగరంగా నిర్మించడంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు తమ బాధ్యతలను మరవద్దు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయడానికి సూక్ష్మ స్థూల స్థాయి ప్రణాళికలతో పట్టణాల సుస్థిరాభివృద్ధికి పాటుపడుతారని ఆశిద్దాం.

**- నేదునూరి కనకయ్య** అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం తెలంగాణ వికాస వేదిక
కరీంనగర్. 9440245771

# దడ పుట్టిస్తున్న గుండె జబ్బులు..



ఇటీవల కాలంలో ఏ నోట విన్నా గుండె పోటు తో మరణించి నట్లు నిత్యం పత్రికలలో వార్తలు వస్తున్నాయి. చిన్న తనం లోనే గుండె పోటు కి గురి అయి మరణించే వారి సంఖ్య అధికంగా వుంటుంది.పట్టుమని 20 యేళ్లు నిండనీ వారు కూడా మృత్యువు గుండె పోటు రూపం లో కబలిస్తో వుంది.నిత్యం వ్యాయామం,యోగ చేస్తూ,ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ,మితా ఆహారం తీసుకుని,డిప్రెషన్ కి దూరం గా వున్న గుండె పోటు తప్పడం లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయి.రాబోయే రోజులలో మన దేశం లో గుండె పోటు మరణాలు అధికంగా ఉంటాయి అని సాక్షాత్తు ఆరోగ్య నిపుణులు అంటున్నారు హృదయ దినోత్సవం ను ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తాయి. గుండెపోటు, గుండెజబ్బులను నివారించడానికి 1946లో జెనీవాలో వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటయ్యింది. 2000 సంవత్సరం నుండి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ నెల ఆఖరి ఆదివారం నిర్వహించబడిన ప్రపంచ హృదయ దినోత్సవం 2011 సంవత్సరం నుండి సెప్టెంబర్ 29వ తేదీన నిర్వహించబడుతుంది.

గుండెజబ్బు అనేది నేడు సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద అనారోగ్య సమస్య. గతంలో కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చే గుండెజబ్బులు నేడు యుక్తవయస్కుల్లో కూడా రావడం ఆందోళనకర పరిణామం. అత్యంత ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నప్పట్టికీ ఎక్కువమంది మరణిస్తున్నది గుండె జబ్బుతోనే. ప్రపంచవ్యాప్తంగా సగటున సంవత్సరానికి ఒక కోటీ డెబ్బైఐదులక్షల మంది అంటే 39 శాతం మరణాలు సంభవిస్తున్నవి అని చెప్పవచ్చు. గుండె జబ్బులతోనే.

ఈసంఖ్యను 2030 వరకు 25 శాతం తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ హృదయ సంస్థ కృషిచేస్తున్నది.గుండెవ్యాధికి అనారోగ్య సమస్యలు, వైద్యపరమైన కారణాల కన్నా సామాజిక, మానసిక సమస్యలు ప్రధాన కారణం. ఒత్తిడికి లోనవడం, మానసిక పరంగా డిప్రెషన్ కు లోను కావడం, చిన్న సమస్యలను పెద్దగా తీసుకోవడం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, శాఖాహారం తగ్గించి మాంసాహారం ఎక్కువగా తినడం, ఉప్పు, కారం, మసాలాలు,నూనెలు అధికంగా తినడం, బాల్యం నుండే జంక్ ఫుడ్ కు అలవాటు పడటం వంటి కారణాల వల్ల నేడు గుండె జబ్బులు అధికంగా రావడానికి కారణం అవుతున్నాయనీ డాక్టర్స్ అంటూ వున్నారు.తలిదండ్రులు పిల్లల ఆటలు, వినోదానికీ సరిగా సమయం కేటాయించలేక , మొబైళ్ళు, కంప్యూటర్ వంటి డిజిటల్ ఉపకరణాలతో కాలక్షేపం చేయిస్తున్నారు. ఇక స్కూళ్లలో ఆటస్థలాలే లేకుండా, ఆటల్లేకుండా బాల్యంనుండి యవ్వనంలోకి అడుగిడుతూ యుక్తవయసుకొచ్చేసరికి శరీరం, కండరాలకు తగినంత శక్తి లేకపోవడంతో 20-25 ఏళ్లకే మధుమేహం, హైబీపీల బారిన పడుతున్నారు. వ్యాహ్యాళికీ, వాకింగ్‌కీ వసతుల్లేని పార్కులూ, ఆటస్థలం లేని స్కూళ్లు. ఆడించని పాఠశాలలు ఇవన్నీ అనారోగ్యానికి హేతువులు.

నేటి బాలలు రేపటి భావి భారత పౌరులకు' బదులుగా 'నేటి బాలలే రేపటి రోగులుగా' తయారవుతున్నారు.దానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.బాల్యం నుండే విద్యార్థులకు ఆహారము, వ్యాయామము,విలువలతో కూడిన విద్య, ఒత్తిడిలేని విద్యపై అవగాహనను ఏర్పరచాలి.

ఏ వయసు వారైనా వాకింగ్, యోగ, ప్రాణాయామము, ధ్యానము, వ్యాయామం చేయడం, మానసిక ఉల్లాసం కలిగించే సంగీతము, కళలు, పుస్తకాలు చదవడం వంటివి అలవర్చుకోవాలి. ఇవన్నీ సమస్యలో సమగ్ర భాగం. మన ఆరోగ్యానికి మంచి ఆహారమేమిటో మనందరికీ తెలుసు. సరదా, కాలక్షేపాలకోసం మనతోపాటు పిల్లలకు సైతం జంక్‌ఫుడ్ తినిపిస్తున్నాం. కూల్‌డ్రింక్‌లతో జరిగే నష్టం తెలిసీ ప్రసార మాధ్యమాలమోజులో తాగిస్తున్నాం. బాల్యంలోనే వికృత రుచులకు అల్వాటు అనేకంటే బానిసలై ప్రకృతి రుచులను మరచిపోతున్నారు. వయసుతోపాటే రోగాల తాకిడీ పెరుగుతున్నది.మాంసాహారాన్ని త్యజిస్తే గొప్ప వ్యత్యాసం తెలుస్తుంది. మాంసాహారులకంటే శాఖాహారులు తక్కువ బరువుతో ఉంటారు. శాఖాహారుల్లో గుండెవ్యాధుల ప్రమాదం 40% తక్కువగానుండటంవల్ల మరో ఏడేళ్ళపాటు ఆదనంగానూ, ఆరోగ్యంగానూ జీవిస్తారు.వ్యాయామ అవసరమెంతో తెలుసు. వ్యక్తులతోపాటు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం.

***యోగ, శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ఈమధ్య కాలాల్లో 'యోగా'ను పెద్దఎత్తున ప్రోత్సాహించారు. ప్రభుత్వాలనుండి, సమాజంనుండీ విధానపరమైన ప్రోత్సాహం ఉంటున్నంది.ఉదయాన్నే లేచి సూర్యకిరణాలు చూస్తూ కొంత వ్యాయామం చెయడం శరీరానికి, మనసుకి కనీసావసరం. యోగ-ధ్యానము ప్రాణాయామము వంటివాటిని మత విశ్వాసానికి సంబంధించిందని కొందరు భావించడం వారి సంకుచిత మనస్తత్వం తెలియజేస్తుంది. నిజానికి యోగా కాణీ ఖర్చులేని సంపూర్ణ ఆరోగ్య జీవన విధానం. వయసుతో నిమిత్తంలేకుండా శరీరం కండరాలు అనుమతించినంతరకు ఆసనాలు వేయవచ్చు.

**ఇక ధ్యానం శ్వాసపై ధ్యాసను నిలిపే ప్రక్రియ.**

యోగా ధ్యానాలతో కండలు పెరగకపోయినా శారీరక ధృడత్వం, మానసిక స్థిరత్వం పెరుగుతాయి. ప్రపంచ యోగా దినోత్సవవం జూన్ 21 తేదీన నిర్వహించుకోవడం యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవడానికి అన్ని దేశాలనుండి పెద్ద మద్దతు వచ్చింది.

***ధూమపానం,మద్యపానాలు త్యజించాలి**

ధూమ పానం, మద్యపానాలు వల్ల కూడా చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు వీటితో సంక్రమించే కేన్సర్, మధుమేహం, పక్షవాతం గుండెజబ్బుకు ఆదనపు మద్దతునిస్తాయి. ఈఅలవాట్లను విసర్జించడానికి కావలసింది మానసిక స్థైర్యం.సాంప్రదాయిక అలవాట్లు, ఆహార విధానాలకు దూరమై తిరోగమన పద్ధతులకు చేరువయ్యాం.

***ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం**

కావున ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకుని మానసికంగా శారీరకంగా సామాజికంగా దూరంగా ఉండి సరైన ఆహార నియమాలు పాటిస్తూ యోగా ప్రాణాయామము వ్యాయామాలు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవన విధానంతో గుండెజబ్బులను దరిచేరనీయకుండా చూసుకోవచ్చు. ప్రతి ఒక్క పౌరుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ హృదయం పదిల పరుచుకొని గుండెపోటు ముప్పు నుంచి తమను తాము రక్షించుకుంటారని ఆశిద్దాం.

**కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**
తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు
9848445134

## అక్షరగీతం

అక్షరగీతం రాయాలని ఉన్నది
మనసుల తట్టే
భావాల మ్రోగింపుని
పల్లవిగా మలచాలని ఉన్నది.

అక్షరపాట పాడాలని ఉన్నది
అమ్మభాష ఒడిలో
లయల్ని ఊపిరిగా చేసుకుని
హృదయాలకు హితబోధ
చేయాలని ఉన్నది.

అక్షరస్వరాలు వినిపించాలని
ఉన్నది
నిశ్శబ్దపు నాడుల్లోకి
నాదమై ప్రవహించి,
భావాల రక్తధారల్లో లయను
నింపాలని ఉన్నది.

అక్షరవీణ వాయించాలని
ఉన్నది
ప్రేమ తంతుల్ని తాకుతూ
వేదనల్ని రాగాలుగా మలచి
శ్రోతలకు శాంతి రుచి
చూపించాలని ఉన్నది.

అక్షరసన్నాయి ఊదాలని
ఉన్నది
పండుగ గాలుల్లో
తెలుగుతనం పరిమళిస్తూ
ఆనందాల పిలుపునివ్వాలని
ఉన్నది.

అక్షరనృత్యం చేయాలని ఉన్నది
అర్థాల అడుగుల్ని
లయల చేతుల్లో పెట్టి
భావాల శిల్పంగా మలచాలని
ఉన్నది.

అక్షరజాతర చేయాలని ఉన్నది
అ ఆ ల నుంచి
క్ష ఱ వరకు
అక్షరాల్ని అల్లరి పిల్లలుగా
పరుగెత్తించాలని ఉన్నది.

అక్షరామృతం తాగించాలని
ఉన్నది
కవిత అనే కలశంలో
తెలుగుభాష తియ్యందనాలు
పోసి
అనంతానందంలో ముంచాలని
ఉన్నది.

అక్షరాలే నా శ్వాస,
అక్షరాలే నా సంగీతం,
అక్షరాలే నా పూజ,
అక్షరాలే నా పరమార్థం.

నేను
అక్షరాలు నడిపించే
భావ యాత్రికుడిని,
సామాన్య సాధకుడిని.

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
భాగ్యనగరం.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు**
జెర్సీ (Amazon Prime Video) ఓడిపోయిన తండ్రి తన కొడుకు కోసం తిరిగి క్రికెట్ బ్యాట్ పట్టిన భావోద్వేగభరిత చిత్రం. నాని నటన మరియు అనిరుధ్ సంగీతం ఈ సినిమాను ఎవర్ గ్రీన్ గా మార్చాయి.




# నేడే పుర పోరు

- పేట జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో పోలింగ్
- జిల్లావ్యాప్తంగా 72 వార్డులు 149 పోలింగ్ స్టేషన్లు

**ముద్ర, నారాయణపేట :**
నారాయణపేట జిల్లాలోని మక్తల్, కోస్గి, మద్దూర్, నారాయణపేట మున్సిపాలిటీల పరిధిలో మంగళవారం పురపాలక ఎన్నికలు జరగనున్నాయి. జిల్లావ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీలలో మొత్తం 72వార్డులు ఉండగా, పోలింగ్ కోసం 149 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 900మంది పోలింగ్ సిబ్బందిని నియమించగా, ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ ఆధ్వర్యంలో 550మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో 24వార్డులకు 96మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.




పోలింగ్ సామాగ్రి పంపిణీతో పాటు ఓట్ల లెక్కింపునకు మక్తల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్దూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, నారాయణపేట యాదగిరి రోడ్డులోని గురుకుల పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లోనే 13న కౌంటింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 16న చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు చేతులెత్తే ప్రక్రియ ద్వారా నిర్వహించనున్నారు. నారాయణపేట పట్టణంలోని పల్ల జింగిడి గడ్డ, శివాజీనగర్ వీధుల్లోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా నారాయణపేట మున్సిపాలిటీలో 101మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజకీయంగా నారాయణపేటలో బీజేపీ-కాంగ్రెస్ మధ్య, మక్తల్‌లో బీజేపీ-బీఆర్ఎస్, మద్దూరులో బీఆర్ఎస్-కాంగ్రెస్, కోస్గిలో కాంగ్రెస్‌బీఆర్ఎస్ మధ్య గట్టి పోటీ నెలకొంది.

**మక్తల్ ఆరో వార్డులో పోలింగ్ వాయిదా**
మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహాదేవప్ప మృతి నేపథ్యంలో ఆ వార్డు ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మహాదేవప్ప అధికార పార్టీ వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ ఘటనపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రెస్‌మీట్ నిర్వహించి స్పందిస్తూ.. మహాదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ నేతల పాత్ర ఉందని రుజువైతే చట్టపరమైన శిక్షకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇదే అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంటులో మాట్లాడారు. బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్ రెడ్డి ఈ ఘటనను ఖండిస్తూ, నిజనిర్ధారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ ఎన్నికలు సాఫీగా నిర్వహించాలి

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**
బుధవారం నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అందరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సజావుగా ఎన్నికలు పూర్తిచేయాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకుడు మయాంక్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి-కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి సంబంధించి శ్రీ ఇందు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని వారు సందర్శించి, పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బంది చెక్‌లిస్ట్ ప్రకారం ఎన్నికల సామాగ్రిని సరిచూసుకున్న తర్వాతే పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలని స్పష్టం చేశారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని, గడువులోపు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ప్రతి ఓటరికి ఓటు వేసే అవకాశం కల్పించాల్సిందేనని తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన



సామాగ్రి పూర్తిస్థాయిలో అందేలా పక్కాగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని, ఓటింగ్ గోప్యత కాపాడేలా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ పూర్తైన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించాలని సూచించారు. శేరిగూడలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌లను మయాంక్ మిట్టల్‌తో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మహేశ్వరం డీసీపీ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక కార్మిక సమ్మెకు పౌర హక్కుల సంఘం మద్దతు

**ముద్ర, కాప్రా :**
ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక కార్మిక సమ్మెకు తెలంగాణ పౌర హక్కుల సంఘం మద్దతు ప్రకటించింది. మంగళవారం కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, అసంఘటిత కార్మిక సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదగాని కుమార్, ప్రజా దేశభక్త ఉద్యమం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి .చంద్రమౌళి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలన కాలం నుంచే కార్మికులు అనేక ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను ప్రస్తుత ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెల్ఫేర్ బోర్డు పరిధిలోని పథకాలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఎన్నిక జరగకుండా చైర్మన్ అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారు..!

- కాంగ్రెస్ అబ్జర్వర్ తీరుపై మాజీ ఎమ్మెల్యే విమర్శ

**ముద్ర, నారాయణపేట :**
ఎన్నికలు జరగకముందే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని ప్రకటించడం రాజ్యాంగ వ్యవస్థకు విరుద్ధమని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి విమర్శించారు. సాధారణంగా ముందుగా కౌన్సిలర్ ఎన్నికలు జరగాలి. అనంతరం ఎన్నికైన కౌన్సిలర్లు తమ అభిప్రాయాలకు అనుగుణంగా అబ్జర్వర్ సమక్షంలో చైర్మన్ అభ్యర్థిని ఎన్నుకోవడం రాజ్యాంగబద్ధ ప్రక్రియ అని పేర్కొన్నారు. అయితే నారాయణపేట పట్టణంలో మున్సిపల్ ఎన్నికలు జరగకముందే, కౌన్సిలర్లు గెలవకుండానే వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా చైర్‌పర్సన్ అభ్యర్థిని ప్రకటించడం సరికాదన్నారు. మంగళవారం నారాయణపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్, జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తరఫున నారాయణపేట మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వచ్చిన ఏఐసిసి జనరల్ సెక్రటరీ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా, ప్రెస్ మీట్ కూడా పెట్టకుండా వెళ్లిపోవడం ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో టీఆర్ఎస్ అత్యధిక స్థానాలు దక్కించుకుంటుందని, రెండేళ్ల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందారని ఆరోపించారు. ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ.. నారాయణపేట పట్టణం ఎస్. రాజేందర్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి చెందిందని, ఎన్నికల ప్రచారంలో ఓటర్లు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నారని అన్నారు. అభివృద్ధికి కేరాఫ్ ఎస్. రాజేందర్ రెడ్డి అన్నది స్పష్టమవుతోందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్ సలీం, విజయసాగర్, సుదర్శన్ రెడ్డి, దస్తగిరి చాంద్ తదితరులు పాల్గొన్నారు.




## పార్కు పనుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

**ముద్ర, హైదరాబాద్ :**
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కేపీహెచ్‌బీ 9వ ఫేజ్‌లో కొనసాగుతున్న పార్కు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా పనులను వేగవంతం చేసి, పార్కును త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నాయకత్వంలోనే ఈ పార్కు నిర్మాణానికి పునాది పడిందని గుర్తుచేశారు. ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం లక్ష్యంగా కేపీహెచ్‌బీ డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ పార్కు పూర్తయితే స్థానిక కాలనీవాసులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్కు అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ డీఈ జీవన్ రెడ్డి, ఆర్కిటెక్ట్ సౌజన్య, ఏఈ రాజీవ్‌తో పాటు డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేష్, పాతూరి గోపి, గంగూరి శ్రీనివాసరావు, హనుమంతరావు, రాంగోపాల్, దాశరథి, చందన శ్రీనివాసరావు, వైబీజీ నాయుడు, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు హాజరయ్యారు.

## పోలేపల్లి ఎల్లమ్మ జాతర ఏర్పాట్లు పూర్తి

**ముద్ర, కొడంగల్ :**
పోలేపల్లి ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఈనెల 12నుంచి ప్రారంభం కానున్న జాతరకు అన్ని విభాగాలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ప్రతిక్ జైన్ ఆదేశించారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం పోలేపల్లి గ్రామంలో జరుగనున్న జాతర నేపథ్యంలో, ఆలయ ప్రాంగణంలో ఎస్పీ స్నేహ మెహ్రా, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. వారం రోజులపాటు కొనసాగే జాతరకు లక్షకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైతే జనరేటర్ల ఏర్పాటు, అంబులెన్సులు, వైద్య శిబిరాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. శానిటేషన్ పనులు విస్తృతంగా చేపట్టి బ్లీచింగ్, త్రాగునీటి క్లోరినేషన్, దోమల నియంత్రణకు ఫాగింగ్ నిర్వహించాలన్నారు. భక్తుల రాకపోకలకు ఆర్టీసీ అదనపు బస్సులు నడపాలని, పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూలైన్ల వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, ఆలయం వరకు రోడ్డు లెవలింగ్ పనులు చేపట్టాలని, మొబైల్ టాయిలెట్లు, త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. జాతర కాలంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, వైద్య, విద్యుత్ శాఖల సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా నియమించాలన్నారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. మహిళా పోలీసులతో సహా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అధికారులు రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సమన్వయ సమావేశంలో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, దేవాలయం ఈఓ రాజేందర్ రెడ్డి, చైర్మన్ వెంకటేష్, డిపిఓ జయసుధ, ఆరోగ్య శాఖాధికారి స్వర్ణ కుమారి, ఆర్అండ్ బి, విద్యుత్ శాఖ, సర్పంచ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కారు సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**రెండు కార్లు దగ్ధం**

**ముద్ర, బండ్లగూడ :**
రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఉన్న మారుతి సుజుకి కారు సర్వీసింగ్ సెంటర్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సర్వీస్ సెంటర్‌లో మంటలు చెలరేగడంతో రెండు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించడంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కొంతమేర ఆస్తి నష్టం జరిగినప్పటికీ, ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. షోరూం వెనుక భాగంలో నిల్వ ఉంచిన స్క్రాప్ సామగ్రి కారణంగానే అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని అగ్నిమాపక అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సంఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.






## పోలింగ్ బూత్‌ల తారుమారు

- ఓటింగ్ బహిష్కరణకు బూరుగుపల్లి-గంగారం ఓటర్ల సన్నాహాలు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 9వ వార్డులో పోలింగ్ బూత్‌లు తారుమారు చేయడంతో ఓటర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. బూరుగుపల్లి గ్రామంలో ఉండాల్సిన పోలింగ్ బూత్‌ను గంగారం సాయిబాబా కాలనీలో ఏర్పాటు చేయగా, గంగారం సాయిబాబా కాలనీలో ఉండాల్సిన పోలింగ్ బూత్‌ను బూరుగుపల్లిలో ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మార్పు వల్ల 1,628 మంది ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని, దీనిపై మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌పై వార్డు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించగా, పోలింగ్ బూత్‌ల మార్పు తమ పరిధిలో లేదని, ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత అవసరమైన సౌకర్యాలు మాత్రమే కల్పించగలమని స్పష్టం చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు అనంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇది కావాలనే చేసి ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన కుమార్తెను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేయించుకునేందుకు ఈ విధంగా పోలింగ్ కేంద్రాలను తారుమారు చేయించారంటూ వారు తీవ్ర ఆరోపణలు చేశారు. బూరుగుపల్లి ఓటర్లు గంగారంలో, గంగారం ఓటర్లు బూరుగుపల్లిలో ఓటు హక్కు వినియోగించాల్సి రావడంతో రాకపోకలపై ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి మారకపోతే ఓటింగ్ బహిష్కరణ దిశగా అడుగులు వేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ నాయకులు ఈ అంశాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల మార్పు సాధ్యం కాదని, అయితే ఓటర్లకు అవసరమైన వసతులు, ప్రయాణ సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## సురవరం సుధాకర రెడ్డి లైబ్రరీకి విరాళాలు

**ముద్ర, కొండాపూర్ :**
సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని నీలం రాజశేఖర రెడ్డి పరిశోధన కేంద్రంలో ఉన్న సురవరం సుధాకర రెడ్డి లైబ్రరీని తెలంగాణ స్టేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు సందర్శించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి శ్రీ సమద్ ఖాన్, అలాగే ఆస్ట్రేలియా నుంచి వచ్చిన కె. రవీంద్రబాబు ఈ సందర్భంగా లైబ్రరీ, పరిశోధన కేంద్ర కార్యకలాపాలను పరిశీలించారు. లైబ్రరీ నిర్వహణ, పరిశోధన కేంద్ర కార్యకలాపాలపై కమిటీ సభ్యులు డా. బి.వి. విజయలక్ష్మి, కన్వీనర్ కంభంపాటి అజయ్‌కుమార్, లైబ్రరీ ఇన్‌ఛార్జ్ జి. రాజగోపాల్ రెడ్డి, కె. జ్యోత్స్న వివరించారు. పుస్తకాల సంఖ్యను పెంచేందుకు యూనియన్ తరఫున రవీంద్రనాథ్, సమద్ ఖాన్ రూ.25 వేల చెక్కును లైబ్రరీకి విరాళంగా అందించారు. ప్రముఖ అభ్యుదయ రచయిత ఏటుకూరి ప్రసాద్ కూడా పుస్తకాల కోసం రూ. 40వేల విరాళం అందించినట్లు ఆమె తెలిపారు.




## జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్‌లకు అభినందనలు

**ముద్ర, శేరిలింగంపల్లి :**
జీహెచ్ఎంసీ ప్రస్తుత పాలకమండలి పదవీకాలం ఫిబ్రవరి 10న ముగియనున్న నేపథ్యంలో, ఐదేళ్ల పాటు విజయవంతంగా పదవీ బాధ్యతలు నిర్వర్తించిన మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఘనంగా అభినందించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో వారిని మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా మేయర్, డిప్యూటీ మేయర్‌లు తమ పదవులకు న్యాయం చేస్తూ సమర్థవంతమైన పాలన అందించారని ప్రశంసించారు. మహిళా ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిచిన వారి సేవలు ప్రశంసనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 11-02-2026
www.mudranews.in | @mudranews



ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు

కేరాఫ్ కంచరపాలెం (Amazon Prime Video)




నాలుగు భిన్నమైన వయసుల ప్రేమ కథల సమాహారం. సహజమైన నటన, హృదయాన్ని తాకే ముగింపుతో ఈ సినిమా ఒక మాస్టర్ పీస్ అని చెప్పొచ్చు.

# పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

### - పలు సూచనలు చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా పురపాలక సంఘాలకు బుధవారం జరగనున్న ఎన్నికలకు సిబ్బంది తరలి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల్లో 244 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ లో 145 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కాగా వీటిలో అత్యల్ప ఓటర్లు 599, అత్యధిక ఓటర్లు 792. భైంసాలో 74 పోలింగ్ కేంద్రాల్లో అత్యల్పంగా 519, అత్యధికంగా 860 ఓటర్లతో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖానాపూర్ లో 25 పోలింగ్ కేంద్రాల్లో అత్యల్పం 581, అత్యధికం 800 ఓటర్లతో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంటా నిర్మల్, భైంసా, ఖానాపూర్ లో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1464 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

భైంసా పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి విధులు నిర్వహించాలని, ఎలాంటి అవక తవకలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మాట్లాడుతూ అధికారులకు సమర్పించాల్సిన పత్రాల్లో లోపాలు లేకుండా చూడాలని సూచించారు.




# అధికారం అడ్డం పెట్టుకొని ఎవ్వరినీ ఇబ్బంది పెట్టలేదు

### - చట్టానికి లోబడి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాం..
### - ధర్మపురి అభివృద్ధే మా ప్రధాన అజెండా: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ముద్ర, ధర్మపురి:**
అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టిన చరిత్ర మాకు లేదని, గత పదేళ్ల పాలనలో మాత్రం ప్రజలు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మంత్రి అడ్లూరి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ చాలా గొప్పదని అంబేద్కర్ వారసులుగా ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడింది నిజం కాదా అని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వెల్గటూరు, ధర్మపురి మండలాల్లో ఏ కగ్రీవాల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఎలా అణిచివేశారో అందరికీ తెలుసని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలపై అనేక మందిపై అక్రమ కేసులు నమోదు చేయించిన చరిత్ర కొప్పుల ఈశ్వర్ దని మంత్రి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ ఏనాడు ధర్మపురి పట్టణ ప్రజల సమస్యలపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు మాట్లాడి నిధులు తీసుకువచ్చే దమ్ములేని వ్యక్తి అని అన్నారు. యాదాద్రిని అభివృద్ధి చేసినప్పటి ధర్మపురిని కేసీఆర్ పట్టించుకోని సమయంలో ఎందుకు సీఎం కేసీఆర్ ను నిధుల కోసం ప్రశ్నించలేదని మంత్రి అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ముఖ్యమంత్రితో మాట్లాడి ధర్మపురిలోని నైట్ కాలేజీ తిరిగి ప్రారంభించామని మంత్రి గుర్తు చేశారు.



#### మున్సిపల్ ఎన్నికల తరువాత సిరిసిల్ల వస్తా..

రాష్ట్ర ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై కేటీఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరియైనది కాదని అన్నారు. తాము మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఏనాడు మాట్లాడలేదని అన్నారు. అధికారంలో ఉన్న సమయంలో భార్య భర్తల ఫోన్ విన్న కేటీఆర్ కాంగ్రెస్ నేతలపై మాట్లాడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తరువాత సిరిసిల్లకు వస్తానని మంత్రి అడ్లూరి అన్నారు.

గత పదేళ్లలో పాలన చేసినవారు ఒక్క కొత్త రేషన్ కార్డు అయినా ఇచ్చారా అని ప్రశ్నించిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత 700 కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చామని తెలిపారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి తెలిపారు. గోదావరి నుంచి కలుషిత నీరు నేరుగా ప్రవహించకుండా రూ.24 కోట్లతో శుద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి ఇటీవలే శంకుస్థాపన చేశామని, త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఐటీఐ, రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద 2,783 కుటుంబాలకు రూ.8 లక్షల మేర బిల్లు మాఫీ చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.7 కోట్ల వ్యయంతో అనేక కుటుంబాలకు గృహాలు అందించామని వెల్లడించారు. రుణమాఫీ కింద 542 కుటుంబాలకు రూ.4 కోట్ల ప్రయోజనం కల్పించామని పేర్కొన్నారు. TFID ద్వారా ఆరు మున్సిపాలిటీల్లో రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మున్నూరు, దళిత, పద్మశాలి వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

#### ఎన్నికల కోడ్ ఉల్లంఘించలేదు..

అధికారాన్ని అడ్డం పెట్టుకొని తాను ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఎక్కడ ఉల్లంఘించలేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. ధర్మపురిలో జరిగిన కార్యక్రమానికి బ్రాహ్మణులు ఆహ్వానిస్తే వెళ్లానని ఆ సమయంలో కొందరు వీడియోలు తీసి తప్పుడు ప్రచారం చేశారని మంత్రి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి ముందే పసిగట్టిన బీఆర్ఎస్ పార్టీ బురద జల్లే ప్రయత్నం చేస్తుందని మంత్రి అడ్లూరి అన్నారు. తాను ఉపయోగిస్తున్న వాహనానికి ప్రతి కిలో మీటర్ కు రూ. 61 చెల్లిస్తున్నానని, ఇటీవల మేడారంలో జరిగిన సంఘటన నేపథ్యంలోనే పోలీసులు భద్రత పరమైన చర్యలు తీసుకున్నారని మంత్రి పేర్కొన్నారు.

#### మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

రోడ్లు, బైపాస్ రోడ్డు, ఎస్సీ, బీసీ స్టడీ సర్కిళ్లు, దివ్యాంగుల హాస్టల్, కళాశాలలు ఇవన్నీ ప్రజల అవసరాల కోసమే చేస్తున్నామని చెప్పారు. పదేళ్లలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కనీసం 25 శాతం పని కూడా జరగలేదని విమర్శించారు. 2027లో గోదావరి పుష్కరాలను బ్రహ్మాండంగా నిర్వహించేందుకు భారీ నిధులు తీసుకొస్తామని, ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

#### సాగునీటి కోసం సీఎం వరకు వెళ్లా..

ఆరేపల్లి నుంచి రాజారాం వరకు పంటలు ఎండిపోతున్న పరిస్థితిని చూసి సీఎంను, ఇరిగేషన్ మంత్రిని బ్రతిమిలాడి సాగునీరు అందించామని తెలిపారు. దొరగారైన కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్ తమ నియోజకవర్గాల్లో ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నారని, ధర్మపురిని మాత్రం నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. బురద జల్లే రాజకీయాలు చేయడం సరికాదని, లక్ష్మీనరసింహస్వామి అన్నీ చూసుకుంటాడని వ్యాఖ్యానించారు. జెడ్పీ చైర్మన్ గా ఉన్నప్పటి నుంచి ఎలాంటి లాభం ఆశించకుండా ప్రజల కోసం పనిచేస్తున్నానని అన్నారు.

#### చేతి గుర్తుకు ఓటు వేయండి..

ధర్మపురి మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సేవ చేసే కౌన్సిలర్లు కావాలంటే కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని, ధర్మపురి అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలపై సీఎంకు బండి సంజయ్ లేఖ

### - డీఏలు, పీఆర్సీ, రిటైర్డ్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

**ముద్ర, కరీంనగర్:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన లేఖ రాశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 3 లక్షల మందికి పైగా రెగ్యులర్ ఉద్యోగులు, 4 లక్షల మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగులు జీవితాంతం దాచుకున్న గ్రాట్యుటీ, ఈపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు కూడా ప్రభుత్వం చెల్లించడం లేదని విమర్శించారు. 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీకి రెండున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి అత్యంత బాధాకరంగా మారిందని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 నుంచి ఇప్పటి వరకు సుమారు 13 వేల మంది ఉద్యోగులు రిటైర్ కాగా, వారికి రావాల్సిన బెనిఫిట్స్, డీఏలు చెల్లించక పోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత విద్యల కోసం దాచుకున్న సొమ్ము అందక కుటుంబాలు కష్టాల్లో పడుతున్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మానసిక వేదనతో మరణించారని, ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని లేఖలో ప్రశ్నించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించడం తెలంగాణకు మాయని మచ్చ తెస్తుందని ఆయన హెచ్చరించారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం రూ.12 వేల కోట్లకు పైగా ఉన్నాయని,. ఏటా రూ.2.5 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో ఈ మొత్తాన్ని భారంగా భావించడం దురదృష్టకరమని అన్నారు. ఇకనైనా ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని వీడి, ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలని కోరారు.

లేని పక్షంలో మున్సిపల్ ఎన్నికల అనంతరం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగుల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు దిగుతుందని హెచ్చరించారు. అవసరమైతే హైదరాబాద్ నడిబొడ్డున దీక్షలు చేపట్టి ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# బీర్ పూర్ శ్రీలక్ష్మి నరసింహస్వామి జాతర ఆదాయం లెక్కింపు

**ముద్ర, జగిత్యాల:**
జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. హుండీ ఆదాయం లెక్కింపులో రూ. 14 లక్షల 13 వేల 226, మిశ్రమ బంగారం 17గ్రాములు, 1 కిలో 400 గ్రాముల మిశ్రమ వెండి, విదేశీ కరెన్సీ నోట్లు 12 వచ్చినట్లు ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ జిల్లా పరిశీలకులు రాజమౌళి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, ఆలయ చైర్మన్ చీర్నేని శ్రీనివాస్, సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ జితేందర్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ సర్పంచ్ గరకుర్తి శిల్ప రమేష్, అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్ కుమార్, మధుకుమార్, చిన్న సంతోష్ కుమార్, తిరుమల సేవా సమితి సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ రఘు, వెంకటేష్, ఆలయ కమిటి సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వాలంటీర్లు, పోలీస్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి

### - దేశం కోసం, ధర్మం కోసం, నిజాయితీగా పనిచేసే వారికి ఓటేయండి
### - కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**ముద్ర, కరీంనగర్:**
మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక శాతం పోలింగ్ జరిగిన పార్లమెంట్ గా కరీంనగర్ అగ్రస్థానంలో నిలపాలని కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశం కోసం, ధర్మం కోసం, ప్రజల అభ్యున్నతి కోసం నిజాయితీగా పని చేసే అభ్యర్థులకే ఓటేసి ప్రజాస్వామ్య విలువలకు పట్టం కట్టాలని అభ్యర్థించారు. మీరు వేసే ఓటు మన కార్పొరేషన్, మన మున్సిపాలిటీల అభివృద్ధికి దోహదం చేయాలని ఆకాంక్షించారు. మీరు వేసే ఓటు అవినీతిపరుల, అరాచక వాదుల, భూకబ్జాదారుల పాలిట అంకుశంగా మారాలని అన్నారు.

# ముదిమాణిక్యంలో కేవైసీ పై గ్రామస్తులకు అవగాహన




**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల ఆదేశానుసారం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఫైనాన్షియల్ లిటరసీ వీక్ లో భాగంగా కేవైసీ పట్ల గ్రామస్తులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం సర్పంచ్ బోయిని రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ముల్కనూర్ బ్రాంచ్ మేనేజర్ అరుణ్ హాజరై మాట్లాడారు. కేవైసీని అప్డేట్ చేయడం, సికేవైసీ, మనీ మ్యూల్ గురించి అవగాహన కల్పించారు. తెలియని లింకులతో కేవైసీని చేయవద్దని, సులభంగా వచ్చే డబ్బు కోసం తీసుకునే రిస్క్ ఎప్పుడు లాభదాయకం కాదని సూచించారు. సైబర్ నేరాల పట్ల గ్రామస్తులకు వివరించారు. బ్యాంకు అకౌంట్లు సైబర్ నేరాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది నితిన్, ఉప సర్పంచ్ పరుశ రాములు, వార్డు సభ్యులు శ్రీనివాస్, జగన్, వివో ఏలు మాడ సరళ, వసంత గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

# భైంసాలో రూట్ మార్చ్

### - పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
బుధవారం జరగబోయే మున్సిపల్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా భైంసా పట్టణంలో మంగళవారం రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డా. జానకి షర్మిల పాల్గొని పోలిం గ్ కేంద్రాల పరిసరాలు, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ రూట్ మార్చ్ లో భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐ లు, ఆర్ ఎస్ ఐ లు, శివంగి మహిళా బృందం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పటిష్ట బందోబస్తు..

### - పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి

**ముద్ర, పెద్దపల్లి:**
మున్సిపల్ ఎన్నికల్లో పటిష్ఠ బందోబస్తు చేపట్టినట్లు పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి తెలిపారు. మంథ నిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ తో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్థానికేతరులు ఎవరు కూడ ఉండవద్దని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలోనే రాజకీయ పార్టీల నాయకులు ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో ఘర్షణలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఎన్నికల సమయంలో గొడవలకు దిగి అనవసరమైన కేసుల్లో ఇరికి తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎన్నికలకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి..

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ముద్ర, పెద్దపల్లి:**
మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పెద్దపెల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సుల్తానాబాద్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల పంపిణీ కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందితో తగిన ఏర్పాట్లను సైతం చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, సాయంత్రం ఎన్నికల సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉండరాదని హెచ్చరించారు.



ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పోలీస్ సిబ్బందికి ఏసీపీ గజ్జి కృష్ణ పలు సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణు, ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీవో దివ్యదర్శనరావు, మున్సిపల్ కమిషనర్ టీ రమేష్, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు**

ఆర్.ఆర్.ఆర్ (Netflix/Zee5) రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఈ విజువల్ వండర్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఎన్టీఆర్, చరణ్ ల నటన మరియు యాక్షన్ సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోతాయి.






## అప్రమత్తంగా, క్రమశిక్షణతో వ్యవహరించాలి

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సూచించారు. పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో మంగళవారం సలహాలు, సూచనలు ఇచ్చారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలొద్దన్నారు. ఎన్నికల సామాగ్రి తరలించడంలో రూట్ మొబైల్ పోలీసు సిబ్బంది విధులు ముఖ్యమైనవని, ఎన్నికల సామాగ్రికి పూర్తి భద్రత కల్పిస్తూ పోలింగ్ సామగ్రిని పోలింగ్ బూత్ లకు చేర్చడం, స్ట్రాంగ్ రూమ్ లకు తరలించడంలో అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. విధి నిర్వహణలో సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్నకుమార్, సీఐలు వెంకటయ్య, రాజశేఖర్, రామారావు, శివకుమార్, ప్రవీణ్ కుమార్, ఎస్ఐ లు, ఏఎస్ఐ లు, సిబ్బంది ఉన్నారు.




## పోలింగ్ కు సర్వం సిద్ధం

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కోదాడ ఆర్డీఓ సిఎచ్.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక సిసి. రెడ్డి ఉన్నత పాఠశాల నుంచి పోలింగ్‌కు అవసరమైన ఎన్నికల సామాగ్రిని బలమైన భద్రత మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. 11, 21, 31 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని, మిగిలిన 82 పోలింగ్ స్టేషన్లు, 82 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 82 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 246 మంది పోలింగ్ అధికారులు, 8 మంది జోనల్ ఆఫీసర్లు ఇలా మొత్తం 491 మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని తెలిపారు. మొత్తం 24 రూట్లలో 25 బస్సులతో పోలింగ్ సామాగ్రి తరలించినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు ఆర్డీఓ వివరించారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంగిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- **సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ముద్ర, సూర్యాపేట:**

ప్రతీ ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలో ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు. 5 మున్సిపాలిటీల్లోని 141 వార్డులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. 446 పోలింగ్ అధికారులు, 446 ఏపీఓ, 1340 ఓపిఓ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సజావు నిర్వహణకు 51 మంది జోనల్ అధికారులు, 46 మంది రూట్ అధికారులు నియమించామన్నారు. స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు 10 ఎస్ఎస్ టీ, 15 ఎఫ్ ఎస్ టీ, 7 వీవీటి, ఏటి 7బృందాలు ఏర్పాటు చేశామన్నారు. పోటీదారుల వ్యయ నియంత్రణకు 5 గురు ఏఇఓ లు, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. 55 మంది మైక్రో అబ్జర్వార్లను నియమించినట్లు కలెక్టర్ అన్నారు.

## ఎన్నికల సిబ్బందికి సామాగ్రి పంపిణీ

**ముద్ర, మోత్కూర్:**

మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ఎన్నికల సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు మధ్య విధి నిర్వహణ ఉద్యోగుల ను పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసినటువంటి వాహనాలలో పోలింగ్ కాంద్రాలకు బయలుదేరారు అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల నోడల్ అధికారి తెలిపారు. ఎన్నికల నియమావళి అమలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందుబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.



# పోలింగ్ సజావుగా నిర్వహించాలి

- **భువనగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**



మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం చౌటుప్పల్, పోచంపల్లి ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం మెటీరియల్ పంపిణీ ప్రక్రియను, భోజనం, ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. పోలింగ్ సిబ్బంది కూడా పోలింగ్ కేంద్రానికి సంబంధించి అన్ని సామగ్రిని ఇక్కడే పరిశీలించి జాగ్రత్తగా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలని అన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని, 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ లో జరుగుతున్న పోలింగ్ తీరు ను నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్య లు గమనిస్తే.. వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు.



## సూర్యప్రభ వాహనంపై స్వర్ణ గిరీషుడు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలలో మంగళవారం స్వర్ణ గిరీష్యుడు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి మంగళవారం లక్ష్మీనారాయణ ఇష్టిహవనం (అన్యోన్య దాంపత్యం కొరకు) శాస్త్రోక్తంగా, భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు.

## సమ్మెను విజయవంతం చేయాలని వినతి

**ముద్ర, నడిగూడెం:**

దేశవ్యాప్తంగా ఈ నెల 12న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని నడిగూడెం గ్రామ పంచాయతీ మండల వర్కర్స్ సీఐటీయూ మండల అధ్యక్షుడు సుభాని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్సూర్ నాయక్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు సుభాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ మల్లెల వెంకన్న, గ్రామ పంచాయతీ వర్కర్స్ చీమట నాగరాజు, మధుసూదన్, తిరపయ్య తిరపయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు పద్మ, స్వరూప, సీతారాం రెడ్డి, సిహెచ్ ఉపేందర్, వీరాంజనేయులు, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు





## కార్మిక చట్టాలను కాపాడుకోవాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు గాడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బీబీనగర్ మండలం జమీలాపేట్ ఆటో కార్మికులను కలిసి ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంతోష్ కుమార్, పోరుబోతుల సత్యనారాయణ, గాడి ఆంజనేయులు, గద్దె యాదగిరి, ఎండి మున్నా, ఎన్ రాహుల్, ఏ శంకర్, డి.వెంకటేష్, డి జాలనాయక్, నరసింహ నాయక్, డి కిషన్ పాల్గొన్నారు

## సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనాలి

- **సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఈనెల 12న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఏజీఐ గ్లాస్ ప్యాక్, ఇండస్ట్రీయల్ పార్క్ లో కార్మికులను కలిసి సిఐటియు నాయకత్వం కరపత్రాలు, బుక్లెట్స్ ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు, మాయ కృష్ణ, లావుడియా రాజు, ఈర్ల రాహుల్ పాల్గొన్నారు.



## మల్సూర్ తిరుమలకు గౌరవ డాక్టరేట్

**ముద్ర, నడిగూడెం:**

నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం గ్రామానికి చెందిన మల్సూర్ తిరుమల, జువాలజీ విభాగంలో గౌరవ డాక్టరేట్ పట్టాను పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్, జువాలజీ విభాగంలో 'కామారెడ్డి జిల్లా కాచపూర్ సరస్సులోని చేపల వివిధ కణజాలాల్లో నీటి నాణ్యత, లోహాల అంచనా' అనే అంశంపై ఆయన పరిశోధనను ప్రొఫెసర్ ఎస్.జితేంద్ర కుమార్ నాయక్, సీనియర్ ప్రొఫెసర్ టాక్సికాలజీ ల్యాబ్, జువాలజీ విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి సమర్థవంతమైన మార్గదర్శకత్వంలో పూర్తి చేశారు. కామారెడ్డి గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ఆటోమాస్ డిగ్రీ కాలేజీలో జువాలజీ, ఫిషరిష్ విభాగంలో అధ్యాపకుడిగా సేవలందిస్తున్నారు. తనకు ఈ డాక్టరేట్ రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రోత్సహించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



# బహుళ జాతి సంస్థలకే ప్రయోజనం

**ముద్ర, ఆత్మకూర్:**

బీజేపీ ప్రభుత్వం వల్ల బహుళ జాతి సంస్థలకే ప్రయోజనం జరుగుతుందని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ అన్నారు. ఈ నెల 12న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం ఆత్మకూరులో జరిగిన రైతు సంఘం మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బహుళ జాతి సంస్థలు విత్తన రంగంలో పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు.



కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి టి. సత్యనారాయణ రెడ్డి, వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ వేముల బిక్షం, నరేందర్, నరేష్, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఓటుతో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి

**ముద్ర, మోత్కూర్:**

అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు, మోత్కూర్ మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్ నేవూరి ధర్మేంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో బీ ఆర్ ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధు, రైతు భీమా ఆలస్యం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల లో రెండు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిందని అన్నారు. ప్రజలకు మేలు జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ మాజీ ఛైర్మన్ తీపిరెడ్డి మేఘారెడ్డి, బీ ఆర్ ఎస్ మండల అధ్యక్షులు పొన్నెబొయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, నాయకులు తాటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





## కరపత్రాల ఆవిష్కరణ

**ముద్ర, ఆత్మకూర్ (ఎం):**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల స్థాయి పాఠశాలల సాంస్కృతిక కార్యక్రమాల ప్రచార కరపత్రాన్ని అఖిలపక్ష నాయకులు మంగళవారం విడుదల చేశారు. ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా నేతాజీ యువజన మండలి, శివాజీ యువజన మండలి సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ స్వర్గీయ జనాయి కోడె అమృతమ్మ, శంకరయ్య గార్ల స్మారకార్థం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతాజీ యువజన మండలి అధ్యక్షుడు మురళీకృష్ణ, శివాజీ యువజన మండలి కార్యదర్శి అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ జె నగేష్, పిఏసిఎస్ మాజీ ఛైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై లక్ష్మారెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ్మెకు సిపిఎం మద్దతు

**మోత్కూర్, ముద్ర:**

కార్మిక సంఘాలు ఈనెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం మోత్కూరు మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్ని వర్గాల ప్రజలు ఇట్టి సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు అన్నారు. మంగళవారం ఆయన మోత్కూర్ లో విలేకరులతో మాట్లాడారు.



**ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు**

మహానటి (Amazon Prime Video) నటి సావిత్రి గారి జీవిత కథ ఆధారంగా తీసిన ఈ చిత్రం ఒక క్లాసిక్. కీర్తి సురేష్ నటన, ఆనాటి వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించడం విశేషం.






## కాంట్రాక్టు ఉద్యోగులకు నేరుగా వేతనాలు చెల్లించాలి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మెడికల్ అండ్ హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా కాకుండా ఏజెన్సీల ద్వారా వేతనాలు అందించడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. శానిటేషన్, పేషంట్ సిరివెన్నెల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 20వేల రూపాయలకు తగ్గకుండా వేతనం అందించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఐక్యంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



## పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ శ్రీదేవి

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టి.కె. శ్రీదేవి పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను మంగళవారం ఆమె పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును కమిషనర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరు సమన్వయంతో, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా జరిగేలా విధులు నిర్వహించాలని పోలింగ్ ప్రెసైడింగ్ అధికారులకు ఆదేశించారు. వారు నిర్వహించాల్సిన విధులు, చేయాల్సిన ఏర్పాట్ల వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన కమిషనర్ టి.కె. శ్రీదేవిని, కలెక్టర్ పి. ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం చేబట్టిన సమగ్ర ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, మున్సిపల్ కమిష నర్లు, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత



- ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో శాంతియుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. మంగళవానం పట్టణంలోని వెస్లీ ప్రాంగణంలో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 686 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. 17 రూట్లలో ఎస్ఐ స్థాయి అధికారులతో రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఐల ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్, నలుగురు డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధమని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనించిన వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం నిషేధమని స్పష్టం చేశారు. పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిస్థాయి నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బుల పంపిణీ, ఓటర్లపై ఒత్తిడి, తప్పుడు ప్రచారాలు నిర్వహించిన వారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. మున్సిపాలిటీల పరిధిలో సెక్షన్ 163 అమలు ఉంటుందని పేర్కొన్నారు







# పుర పోరుకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్ రాహుల్ రాజ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పుర పోరుకు సర్వం సిద్ధమైంది. బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. జిల్లాలో 4 పురపాలక సంఘాలు ఉన్నాయి. ఇందులో 74 వార్డుల్లో 86,109 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 41,516, మహిళలు 44,591, ఇతరులు ఇద్దరు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 180 పోలింగ్ అధికారులు, 180సహాయ పోలింగ్ అధికారులు, ఇతర సిబ్బంది 502, జోనల్ అధికారులు 22 మందిని నియమించారు.

**డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన..**

జిల్లా కేంద్రంలోని వెస్లీ పాఠశాల గోల్ బంగ్లా ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని ఆదేశించారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందిందో, లేదా జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లనును సైతం పరిశీలించారు. సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని, సెకన్ కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కలెక్టర్ వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డిఎస్ఓ రాజిరెడ్డి తదితరులు ఉన్నారు. అదనపు కలెక్టర్ మెంచు నగేష్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సందర్శించారు. ఏర్పాట్లు పరిశీలింతి పలు సూచనలు చేశారు.

# నేడే బల్దియా ఎన్నికలు

- జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో పోలింగ్

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో బుధవారం ఎన్నికలు నిర్వహించున్నారు. ఇందుకోసం పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు . ఓటర్లు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకునేలా అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్-జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగనున్నాయి.



జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మొత్తం 256 వార్డులు ఉన్నాయి. ఇందుకోసం 541 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు.

3,41,808 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,71,151, మహిళలు 1,70,638, ఇతరులు 19 మంది ఉన్నారు.

**మున్సిపాలిటీ వారీగా ఓటర్ల వివరాలు..**

ఆందోల్-జోగిపేట్: 20 వార్డులు, 32 పోలింగ్ కేంద్రాలు, 16,450 మంది ఓటర్లు.
గడ్డపోతారం: 18 వార్డులు, 18 పోలింగ్ కేంద్రాలు, 11,983 మంది ఓటర్లు.
గుమ్మడిదల: 22 వార్డులు, 44 పోలింగ్ కేంద్రాలు, 23,926 మంది ఓటర్లు.
ఇంద్రేశం: 18 వార్డులు, 19 పోలింగ్ కేంద్రాలు, 13,086 మంది ఓటర్లు.
ఇస్నాపూర్: 26 వార్డులు, 60 పోలింగ్ కేంద్రాలు, 35,912 మంది ఓటర్లు.
జిన్నారం: 20 వార్డులు, 22 పోలింగ్ కేంద్రాలు, 12,473 మంది ఓటర్లు.
కోహిర్: 16 వార్డులు, 16 పోలింగ్ కేంద్రాలు, 10,832 మంది ఓటర్లు.
నారాయణఖేడ్: 15 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు, 17,675 మంది ఓటర్లు.
సదాశివపేట : 26 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు 36,982 మంది ఓటర్లు,
సంగారెడ్డి : 38 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు 83,668 మంది ఓటర్లు.
జహీరాబాద్: 37 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు, 78,819 మంది ఓటర్లు.

**ఎన్నికల అధికారుల నియామకం..**

పోలింగ్ నిర్వహణ కోసం ఎన్నికల అధికారులను నియమించారు. జిల్లాలో 103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 649 మంది ప్రిసైడింగ్ అధికారులు, 649 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1,948 మంది ఇతర పోలింగ్ అధికారులు,73 మంది మైక్రో అబ్జర్వర్లు, 49 మంది జోనల్ ఆఫీసర్లను నియమించారు. ప్రశాంతంగా, సురక్షితంగా పోలింగ్ జరిగేలా శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## వైభవంగా రేణుకా మాత బోనాలు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

పట్టణంలోని పసుపులేటి ఒడ్డున వెలిసిన రేణుకా మాత బోనాల ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక మాత ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కుల పెద్ద సిద్దాగౌడ్ ఇంటి నుంచి పెద్ద బోనం తీశారు. అనంతరం గౌడ కులస్తులు, మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలతో దేవాలయానికి బయలుదేరారు. అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జనగామ మహిళల బోనాలు, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు విద్యాదర్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు మంగ రమేష్ గౌడ్, గౌడ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఎన్నికల నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కోహిర్, సదాశివపేటలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీఓ, ఏపీఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని ఆరా తీయడంతో పాటు హాజరు నివేదికను పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సామగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ని పోలింగ్ అధికారులు పరిశీలించు కోవాలని పోలింగ్ బృందాలకు సూచించారు. పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్ఓలకు సూచించారు.

అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రెవిన్యూ డివిజనల్ అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు

బాహుబలి (1 & 2) (Hotstar/ Netflix) భారతీయ సినిమా సత్తాను చాటిన మహా కావ్యం. గ్రాఫిక్స్, భారీతనం మరియు బలమైన పాత్రలతో ఈ సినిమా ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం.




# అరెస్ట్ రాజకీయం!

- స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాల మంట
- మున్సిపల్ పోరులో కేసీఆర్–కేటీఆర్ అరెస్ట్ అస్త్రం
- అరెస్టు డిమాండ్ల మధ్య రేవంత్ డబుల్ గేమ్ ఆరోపణలు
- కేసీఆర్ అరెస్టుపై కాంగ్రెస్–బీజేపీ పరస్పర ఆరోపణలు
- అరెస్టుల వెనుక రాజకీయ పర్యవసానాల లెక్కలు
- 'అస్మదీయులు ఎవరు?' అంటూ పార్టీల నిందల యుద్ధం
- స్థానిక సమస్యలు పక్కన.. మున్సిపల్ ఎన్నికల్లో స్వార్థ రాజకీయం




**ముద్ర న్యూస్:**

స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు స్థానిక సమస్యలు, అంశాలే కీలకం అవుతాయి. స్థానిక ఏజెండా ఆధారంగానే అభ్యర్థులు పోటీ చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలను రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో స్థానిక అంశాలు కాకుండా రాష్ట్ర అంశాలతో రాజకీయం చేస్తున్నారు. స్థానిక అంశాలకు మించి కేసీఆర్, కేటీఆర్ అరెస్ట్ కేసు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రధాన ఆయుధంగా మారింది. అరెస్టును బీజేపీ అడ్డుకుంటోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. రేవంతే అడ్డుకుంటున్నారని బీజేపీ ఆరోపిస్తోంది. ఇది ఓటర్లలో బీఆర్ఎస్‌పై వ్యతిరేకతను పెంచే వ్యూహంగా ఉంది.

**రేవంత్ డబుల్ గేమ్..**

బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ, బీఆర్ఎస్‌తో కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా అరెస్టు చేయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక ఫార్ములా ఈ రేస్ కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్టు చేసే అవకాశం ఉన్నా రేవంత్ కావాలనే చేయడం లేదని ఆరోపిస్తున్నారు.

**కేంద్రంపై రేవంత్ ఆరోపణ..**

ఇదిలా ఉంటే.. కేసీఆర్‌ను అరెస్టు చేయకుండా బీజేపీ అడ్డుకుంటోందని, ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. అందుకే కేసీఆర్ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు. బీఆర్ఎస్ మొదటి నుంచి బీజేపీకి మద్దతు ఇస్తోందని, దానికి కృతజ్ఞతగానే కేసీఆర్ అరెస్టు చేయడం లేదని రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు.

**రాజకీయ పర్యావసానాలే కీలకం..**

కేంద్రమైనా, రాష్ట్రమైనా ముఖ్య నేతలు, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులను అరెస్టు విషయంలో జాప్యం చేయడానికి కారణం పర్యవసానాలే. అరెస్టు తర్వాత ఏం జరుగుతుందని ఆలోచిస్తాయి. ఈ విషయం సీఎంకు తెలియంది కాదు. అలాగే సీబీఐతో సోనియా, రాజీవ్ గాంధీపై విచారణ చేపట్టిన సీబీఐ అరెస్టు విషయంలో మాత్రం వెనుకాడుతోంది. అంటే కేంద్రం కూడా అరెస్టులకు తొందరపడడం లేదు.

**అస్మదీయులు అంటూ ప్రచారం..**

కాంగ్రెస్ బీఆర్ఎస్-బీజేపీ ఒక్కటే అని ఆరోపిస్తోంది. ఇక బీజేపీ కాంగ్రెస్-బీఆర్ఎస్ ఒక్కటే అంటోంది. ఇందులో అస్మదీయులు ఎవరు అన్నది తేల్చడం లేదు. బీజేపీ మాత్రం ఇష్యూలను లైవ్‌గా ఉంచి పరిష్కారం మానేస్తోంది. కర్ర విరగొద్దు.. పాము చావాలి అన్నట్లుగా వ్యవహరిస్తోంది. మొత్తానికి అరెస్ట్ రాజకీయాలతో అన్ని పార్టీలు స్థానిక సమస్యలను గాలికి వదిలేశాయి. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీలు స్వార్థ రాజకీయాలే చేస్తున్నాయి.



## పోల్ మేనేజ్ మెంట్ పై పార్టీల ఫోకస్

- ఇక ఆశలన్నీ అటువైపే..?

**ముద్ర న్యూస్:**

రాష్ట్రంలో ప్రచారం ముగియడంతో మున్సిపాలిటీల్లో పోటీచేసే అభ్యర్థులు పోల్ మేనేజ్ మెంట్ పై దృష్టి సారించారు. అన్ని పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడంపై దృష్టిసారించాయి. ఎదురుపార్టీ అభ్యర్థి ఎంత ఖర్చు చేస్తున్నాడు.. ఓటర్ కు ఎంత ఇస్తున్నాడు..అనే దానిపై ఫోకస్ పెట్టి దానికంటే ఎక్కువగా ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎలాగైనా.. ఎంత ఖర్చుఅయినా ఫర్వాలేదు కానీ గెలిచి తీరాల్సిందేనని అభ్యర్థులు బావించి పోల్ మేనేజ్ మెంట్ పై దృష్టి సారించారు.

**అభ్యర్థుల గుండెల్లో రైళ్లు..**

మున్సిపల్ వార్డుల్లో గెలిస్తే మేయర్ గానీ డిప్యూటీ మేయర్ లేకుంటే చైర్మన్ లేదా వైస్ చైర్మన్ వస్తుందని భావించిన అభ్యర్థులు భారీగా ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదు. వార్డుల్లో లేదా డివిజన్లలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలిచేందుకు ఎలాగైనా గెలిచి తీరాలని భావిస్తున్నారు. ప్రజలు ఏమనుకుంటున్నారు.. మన పార్టీ పరిస్థితి ఎలా ఉంది.. ఓటుకు ప్రజలు ఎంత ఆశిస్తున్నారు.. అవతలి పార్టీ ఎంత ఇద్దామనుకుంటోంది.. మన పార్టీ గెలుపుపై ఏమైనా సందేహాలు ఉన్నాయా.. ప్రత్యర్థి ఎత్తులను ఎప్పటికప్పుడు గమనించాలి.. బూత్ స్థాయిలో నిఘా పెంచండి.. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరును కలవండి.. ఇదీ ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల్లోని అభ్యర్థులు భావిస్తున్నారు. పోలింగ్‌కు ఒకరోజే సమయం ఉండడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా పార్టీలు పోల్ మేనేజ్‌మెం ట్‌పై ఫోకస్ పెట్టాయి. ఈసారి ఎన్నికలను గతం కంటే చాలెంజ్‌గా తీసుకుని ఓటుకు ఎంతైనా ఇచ్చి ప్రజలను తమ వైపునకు తిప్పుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు.

**ఓటుకు రూ.1500 నుంచి 3 వేల వరకు..**

మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఇప్పటికే పోటీచేస్తున్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు శ్రీకారం చుట్టినట్లు ప్రచారం జరుగుతుంది. ప్రతి ఓటరు మందు బాటిలు, మహిళకు కూల్ డ్రింక్స్ పంపణీ చేస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు మాంసం సైతం కొన్ని చోట్ల పంపిణీ చేస్తున్నారు. ఇంట్లో ఎన్ని ఓట్లు ఉంటే ఓటుకు రూ.1,500 నుంచి 3 వేల వరకు పంపిణీ స్టార్ట్ చేసినట్లు సమాచారం. ఓటర్లు అందుబాటులో లేకుంటే వారికి గూగల్ పే, ఫోన్ పే చేస్తున్నారు. అంతేకాదు వారికి సన్నిహితులతో ఫోన్ చేయిస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటే వారిని రప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి తోడు యువతకు ఆఫర్లు ప్రకటిస్తున్నారు. కాలనీల వారీగా యువతకు దావత్ లు, సంఘాలు ఉంటే వారికి ఫండింగ్, అభివృద్ధికి హామీలు సైతం గుప్పిస్తున్నారు. అందుబాటులో ఉంటామని హామీలు ఇస్తున్నారు.

**పది మంది ఉంటే వాహనం..**

బీఆర్ఎస్ తో పాటు ఇతర పార్టీలు సైతం 30 మంది ఓటర్లకు ఒకరిని ఇన్ చార్జిగా నియమించారు. ప్రతి ఓటర్ ను పోలింగ్ బూత్ కు తీసుకొచ్చేవరకు వారికే బాధ్యతలు అప్పగించారు. అంతేకాదు వారికి మంచిచెడ్డా చూసే బాధ్యతలు ఇచ్చారు. ఓటర్లు ఇతర ప్రాంతాల్లో ఉంటే మాత్రం వారు వచ్చేందుకు రవాణా ఖర్చులు, పది మంది ఉంటే వాహనం ఏర్పాటు చేస్తున్నారు. ఓటు వేసి తిరిగి వారి నివాసా ప్రాంతాలకు చేర్చే బాధ్యతను తీసుకుంటున్నారు. ఓటుకు ఇంతా అని చెప్పి అది సఫరేట్ గా ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే కొంత మంది ఇతర ప్రాంతాల్లో ఉంటే వారికి సైతం ఒక ఇన్ చార్జిని నియమించినట్లు ఓ పార్టీ నేత తెలిపారు.

**ఎవరికి పట్టం..**

ముఖ్య నేతలకు పంపకాల బాధ్యతను చేపట్టారు. ఇప్పటికే వార్డులేదా డివిజన్ లోని ప్రతి ఓటర్ ను ఇప్పటికే రెండుమూడు సార్లు కలిశారు. అయితే మళ్లీ ఒక్కొక్కరుగా గడపగడపకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఇతర పార్టీల అభ్యర్థుల పైనా దృష్టిసారించారు. ఏది ఏమైనా అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఇండిపెండెంట్ గా పోటీ చేస్తున్నవారంతా పోల్ మేనేజ్ మెంట్ పైనే దృష్టిసారించారు. అయితే ఎవరికి పట్టం కడతారోనని విస్తృత చర్చ జరుగుతుంది.

# మరింత అభివృద్ధి కోసం కాంగ్రెస్ ను గెలిపించాలి

- రాష్ట్ర ప్రభుత్వంతోనే గల్లీ సమస్యల పరిష్కారం
- తెలంగాణపై వివక్ష చూపుతున్న కేంద్రం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట (హుస్నాబాద్), ముద్ర ప్రతినిధి:**

పట్టణాల్లో మరింత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం ఆయన సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం అని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంత ప్రజలు 90 శాతం ఓటు హక్కు వినియో గించుకుంటున్నారని గుర్తు చేశారు. అర్బన్ ప్రాంతాల్లో కూడా ప్రతీ ఒక్కరు ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాలను ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో జీవన స్థితీగతులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు, శానిటేషన్తదితర అంశాలపై ప్రజా పాలన ప్రభుత్వం సమగ్ర ఆలోచనతో ఉందన్నారు.

తెలంగాణ లో ప్రతి పౌరుడు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. తాము నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. హుస్నాబాద్ పట్టణంలో 600 ఇల్లు ఇచ్చామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా మేస్త్రి , వండ్రంగి ఇతర కులాలకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు ప్రజా పాలన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, రైతు భరోసా వంటి అనేక పథకాలు రైతు అందిస్తున్నామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ ఎస్, బీజేపీ కలవడం వల్ల 8 ఎంపీ సీట్లు గెలిచారని ఎద్దేవా చేశారు. మీరు ఇచ్చే గెలుపు తెలంగాణ ప్రభుత్వానికి మరింత ఉత్సాహాన్నిస్తుందన్నారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి చేతిలో ఉందన్నారు. పట్టణాల్లో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మున్సిపాలిటీ లకు ప్రత్యేక నిధులు ఇవ్వట్లేదని విమర్శించారు. ప్రధాని, కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు అనేకసార్లు కలిసి రాష్ట్ర అభివృద్ధి కి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినా కేంద్రం బడ్జెట్ లో తెలంగాణ పట్ల నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణపై వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే గల్లీ సమస్యలు పరిష్కారం చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి కి పాల్పడిందన్నారు. కరీంనగర్ లో బీజేపీ తో కలిసి పని చేస్తుందన్నారు. అభివృద్ధి , మౌలిక సదుపాయాలతో అర్బన్ ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి తమ పార్టీ పని చేస్తుందన్నారు. హుస్నాబాద్ అభివృద్ధి మీ కళ్ల ముందు జరుగుతుందన్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్న పార్టీకి అవకాశాలు ఇస్తేనే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

# పూర్తి రుణమాఫీ పచ్చి అబద్ధం

- చర్చకు సిద్ధం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్రంలో రైతులందరికీ రుణమాఫీ అయిందంటూ సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పక్కా ఆధారాలతోనే ఈ ఆరోపణలు చేస్తున్నానని వెల్లడించారు. కావాలంటే సీఎం సొంత జిల్లా మహబూబ్ నగర్‌కు రమ్మన్నా తాము వస్తామన్న కవిత.. లేకపోతే నిజామాబాద్‌కు రమ్మన్నా సిద్ధమేనని సవాల్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని బంజారాహి జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. రైతులకు రూ. 44 వేల కోట్లు రుణమాఫీ చేశామన్న గొప్పలు చెప్పుకుంటోన్న సీఎం, మంత్రులు.. కేబినెట్ లో మాత్రం రూ. 28 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెప్పినట్లు ఆరోపించారు. తెలంగాణ రాకముందు ఆర్టీసీ కార్మికుల సంఖ్య 52 వేలు ఉంటే... రాష్ట్ర ఏర్పాటు తర్వాత 12 ఏళ్లలో వారి సంఖ్య 32 వేలకు చేరిందన్నారు. చిన్న కారణాలకే కార్మికులను తొలగించారని బీఆర్ఎస్ పాలన తీరును విమర్శించారు.

**మున్సిపోల్స్ లో హంగ్ పక్కా..**

తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ మున్సిపాలిటీల్లో హంగ్ పక్కా అని కవిత జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిశాయని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా సీట్లు సర్దుబాట్లు చేసుకున్నాయని ఆరోపించారు. సింహం గుర్తు పై పోటీ చేస్తున్న తమ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**ఓవైసీ బ్రదర్స్ అధికారం చుట్టు తిరిగే సన్ ఫ్లవర్స్..**

ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదొద్దీన్ ఓవైసీ అతని తమ్ముడు ఎమ్మెల్యే అక్బరొద్దీన్ అధికారం చుట్టు తిరిగే సన్ ఫ్లవర్స్ అని కవిత అభివర్ణించారు. గతంలో రాయల తెలంగాణ అని తెలంగాణను వ్యతిరేకించిన వారిద్దరు రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్ కలిసి గత ప్రభుత్వంలో అధికారంలో పాలు పంచుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ తో జత కట్టారని విమర్శించారు.

**బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సిందే..**

ఈ నెల 26న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయని కవిత తెలిపారు. ఈ బడ్జెట్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే అవకాశం ఉన్న చివరి బడ్జెట్ అంటూ కామెంట్ చేశారు. ఆ తర్వాత బడ్జెట్‌ల పై ఎన్నికల ఒత్తిడి ఉంటుందని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా బడ్జెట్‌లో బీసీలకు సంవత్సరానికి రూ. 20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.




## అల్లాదుర్గం మండలంలో చిరుత పులి సంచారం

- ఆనవాళ్ల గుర్తింపు

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో చిరుత పులి సంచరిస్తుందని శంకరంపేట్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం అటవీ శాఖ అధికారులు చిరుత సంచరిస్తున్న ప్రదేశాలను పరిశీలించి, ఆనవాళ్లను గుర్తించారు. గొల్ల కుంట తండా సమీపంలోని అటవీ ప్రాంతంలోకి చిరుత వెళ్లినట్లు గ్రహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాగ్రత్తలు పాటించాలని సమీప తాండా ప్రజలకు సూచించారు. కనుక గొర్ల కాపరులు, పొలాలకు వెళ్లే రైతులు, గ్రామస్తులు ఆ తండా వైపు వెళ్లొద్దని పేర్కొన్నారు. మరోసారి చిరుత కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ మనస్విని, సర్పంచ్ మాన్యా నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు**

నువ్వు నాకు నచ్చావ్ (Hotstar) విక్టరీ వెంకటేష్ మార్క్ కామెడీ మరియు త్రివిక్రమ్ పంచ్ డైలాగులతో సాగే ఈ సినిమా ఎన్నిసార్లు చూసినా బోర్ కొట్టదు. ఇది ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్.




# అధికారులను సస్పెండ్ చేయాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని 9వ వార్డులోని 20, 21వ వార్డులను తారుమారు చేసి ఓటర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలనీ కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పిటీసీ ముత్తహార్ షరీప్ డిమాండ్ చేశారు. పోలింగ్ అధికారుల నిర్లక్ష్యం ఓటర్లకు ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కలెక్టర్ తో మాట్లాడిన కూడా ఈ సమస్య పరిష్కారం కాలేదన్నారు.

# అమెరికాను బీట్ చేసిన భారత్.. అగ్రరాజ్యానికి షాక్

**ముద్రన్యూస్ :**

ప్రపంచంలో సంపన్న దేశం అమెరికా. అభివృద్ధిలోనూ అగ్రస్థానమే. తర్వాతి స్థానంలో చైనా ఉంది. అమెరికాతో పోటీ పడుతోంది. ఇక భారత్ కూడా గడిచిన పదేళ్లలో మెరుగైన అభివృద్ధి సాధించింది. అయితే తాజాగా అభివృద్ధి రేటులో భారత్ అమెరికాను మించిపోయింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) 2026 ఆర్థిక అంచనాలను సవరించి, భారత్ గ్లోబల్ వృద్ధిలో 17 శాతం వాటా ఉందని తెలిపింది. ప్రపంచ మాంద్యం నేపథ్యంలో భారత మెరుగైన వృద్ధి సాధిచడం గమనార్హం.

**మూడు వారాల్లో గణనీయ పురోగతి..**

గత మూడు వారాల్లో భారత వృద్ధి రేటు గణనీయంగా పెరిగింది. తయారీ రంగం, మౌలిక పెట్టుబడులు ప్రధాన కారణాలు. ప్రపంచ వాణిజ్యం కుంగిపోతుంటే భారత వ్యవస్థ దృఢంగా నిలిపింది. గ్లోబల్ వృద్ధిలో అమెరికా వాటా కేవలం 9.9%కి పరిమితమైంది. చైనా 26.6%తో అగ్రస్థానంలో ఉంది. భారత వేగం ఆసియా దేశాల్లో ప్రధానం.

**సూపర్ పవర్‌గా చైనా, భారత్..**

ఆసియా ఆర్థిక వ్యవస్థల్లో భారత పాత్ర పెరుగుతోంది. జనాభా శక్తి, ఇన్‌ఫ్రా అభివృద్ధి విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. 2026లో ఈ ట్రెండ్ గ్లోబల్ ఆధిపత్యానికి దారితీస్తుంది. గ్లోబల్ వృద్ధిలో భారత్, చైనా కలిపి 43.6 శాతం ఉంది. ఆసియా పసిఫిక్ దేశాల వాటా 50 శాతం దాటుతుంది. టాప్ టెన్ జాబితాలో భారత్, చైనా తోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇండోనేషియా, తుర్కియే, వియత్నాం, సౌదీ అరేబియా కాంట్రిబ్యూట్ చేస్తున్నాయి.

**నిపుణుల కీలక వ్యాఖ్యలు..**

తాజా పరిస్థితులపై ప్రపంచకుబేరుడు కీలక వ్యాఖ్యలు చేశారు. పవర్ బ్యాలెన్స్ మారుతుందని పేర్కొన్నారు. గ్లోబల్ గ్రోత్‌ను పాశ్చాత్య దేశాలు మాత్రమే ప్రభావితం చేయలేవని నిపుణులు అంటున్నారు. పవర్ బ్యాలెన్స్ షిఫ్ట్ చేయడంలో భారత్ కీలకంగా మారుతోందని పేర్కొంటున్నారు.

# కాంగ్రెస్ బెదిరింపులే బీజేపీ అభ్యర్థి మృతికి కారణం : కిషన్ రెడ్డి

**ముద్ర, తాండూర్ :**

నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహాదేవప్ప, కాంగ్రెస్ పార్టీ నేతల ఒత్తిళ్లు, బెదిరింపులు, దౌర్జన్యాల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పో రెడ్డి కిషన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం తాండూర్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో నిలవడం కోసం కాంగ్రెస్ పార్టీ ఎలాంటి దిగజారుడు రాజకీయాలకైనా వెనుకాడదని విమర్శించారు. పదవుల కోసమే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించారని గుర్తుచేసిన కిషన్ రెడ్డి, అప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్య విరుద్ధ విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఒకవైపు రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ నేతలు మాటలు చెబుతుండగా, మరోవైపు తెలంగాణలో ఎన్నికల సమయంలో బెదిరింపులు, దౌర్జన్యాలు కొనసాగించడం దురదృష్టకరమన్నారు. మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించే పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు మనోహర్ రావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక హక్కులు పోరాటాల ద్వారానే సాధ్యం

- **సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య**

**ముద్ర, కుషాయిగూడ :**

ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు, చట్టాలు సాధ్యమయ్యాయని, ఈ చారిత్రక సత్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ మంగళవారం నాచారం చౌరస్తాలో నిర్వహించిన కార్మిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్మికుల రక్తత్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్ లాభాల కోసం రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలులోకి వస్తే ఉద్యోగ భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులు పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు. పర్మినెంట్ ఉద్యోగాలను తొలగించి కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేయాలన్న ప్రభుత్వ యత్నం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నారు. షాహీ పరిశ్రమలో 1,600 మంది మహిళా కార్మికులు ఎలాంటి యూనియన్లకు చెందకుండానే పది రోజుల పాటు రాత్రింబవళ్లు పోరాడి తమ వేతన హక్కులు సాధించుకున్న ఉదాహరణను గుర్తుచేస్తూ, పోరాటం లేకుండా హక్కులు లభించవని స్పష్టం చేశారు. లేబర్ కోడ్ల పేరుతో అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సదస్సులో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తూ సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, ఐఎఫ్టియు నాయకుల శివబాబు, ప్రవీణ్, ఎన్ఐఈయు అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ రావు, సిఐఈయు అధ్యక్షుడు బివి సత్యనారాయణ, ఏపీరాక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ మణికంఠ, వాయిత్ ఇండియా యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యంగౌడ్, కాకతీయ కెమికల్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గ్రో కంట్రోల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యం.డి. షకీల్, హార్డ్కేస్ ఇంజినీరింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్, నాచారం, మల్లాపూర్ ఏరియా కార్మిక సంఘాలు వివిధ పరిశ్రమ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.110 కోట్ల నిధులు

- **అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం : మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, కాప్రా :**



ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.110 కోట్ల నిధులు కేటాయించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కాప్రా, చర్లపల్లి, మీర్పేట్ హెచ్‌పీ కాలనీ, ఉప్పల్ ప్రాంతాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మేయర్ విజయలక్ష్మితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో క్రీడా మైదానాలు, ఇండోర్-అవుట్‌డోర్ గేమ్స్ కాంప్లెక్స్‌లు, పాఠశాల భవనాలు తదితర అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తిచేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు స్వర్ణరాజ్, ప్రభుదాస్, బొంతు శ్రీదేవితో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**- ఉప్పల్‌లో అభివృద్ధి కార్యక్రమం వద్ద ఉద్రిక్తత..**

ఉప్పల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి మంగళవారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అభివృద్ధి పనుల సందర్భంగా ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి అనుచరులు, కాంగ్రెస్ ఉప్పల్ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరుపక్షాల శ్రేణులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడటంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి స్పందిస్తూ, తమపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

- **పోలింగ్ మెటీరియల్‌ను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించాలి : కలెక్టర్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి అధికారి అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం వికారాబాద్ జిల్లా మేరీనాట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, పోలింగ్ అధికారులకు అందజేసిన మెటీరియల్‌ను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించారు. ఈసందర్భంగా బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ బాక్సులు, ఇతర ఎన్నికల సామాగ్రిని పోలింగ్ కేంద్రాల వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులను జాగ్రత్తగా పరిశీలించి ప్యాక్ చేయాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరుకునే వరకు అన్ని ఏర్పాట్లను మరోసారి నిర్ధారించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



**తాండూర్ లో..**

తాండూరు : వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో మున్సిపల్ పరిధిలోని 36వార్డులకు మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తాండూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 77,029 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 39,525 మంది మహిళలు, 37,049 మంది పురుషులు, ఐదుగురు ఇతరులు ఉన్నారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన 117 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 585 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ ప్రక్రియ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగనుంది. ఎన్నికల ఏర్పాట్లను తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ తారా సింగ్‌లు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పరిశీలించారు. పట్టణంలోని సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు.



# పాలమూరులో పోలీసు రాజ్యం నడుస్తోంది

- **మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**

పాలమూరులో పోలీసు రాజ్యం కొనసాగుతోందని, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా నిలుస్తూ బీఆర్ఎస్ అభ్యర్థులను అడ్డుకుంటూ పోలీసులు అరాచకం సృష్టిస్తున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే అధికారులు ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేయాల్సి ఉన్నప్పటికీ, మహబూబ్‌నగర్ జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. పోలీసు అధికారులే అన్ని వ్యవహారాలను నడిపిస్తున్నారని, ఇతర శాఖల పనుల్లో కూడా వారు జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ పోలీసులకు దేశవ్యాప్తంగా మంచి పేరు ఉందని, కానీ కొందరు అధికారుల వైఖరి వల్ల శాఖకు చెడ్డపేరు వస్తోందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో కాంగ్రెస్ అభ్యర్థుల వెంట పెద్దసంఖ్యలో కార్యకర్తలను అనుమతించిన పోలీసులు, బీఆర్ఎస్ అభ్యర్థుల వెంట మాత్రం నిబంధనల ప్రకారం ముగ్గురినే అనుమతించారని ఆరోపించారు. అంతేకాకుండా, నామినేషన్లు ఉపసంహరించుకోవాలంటూ పలువురు అభ్యర్థులపై పోలీసులు ఒత్తిళ్లు తెచ్చారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పోలీసులు, కాంగ్రెస్ నేతల వేధింపులను తట్టుకోలేక జిల్లాలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు ఉన్నాయని, సామాన్యులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించే పరిస్థితి మహబూబ్‌నగర్‌లో లేదని ఆరోపించారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, ఈ విషయమై ఎన్నికల అధికారులను ప్రశ్నిస్తే "మాకు తెలియదు" అంటూ తప్పించుకుంటున్నారని తెలిపారు. పాలమూరులో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బెక్కం జనార్ధన్, మనోహర్, కరుణాకర్ గౌడ్, స్వదేశ్, మురళి, ఉమామహేశ్వరి, రవిప్రకాష్, శ్రీహరి, రాంనాథ్ గౌడ్, శ్రీరామ్ కుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# లా సెట్ అభ్యర్థులకు టిసాట్ ప్రత్యేక లైవ్

**ముద్ర, శేరిలింగంపల్లి :**

మే 18న నిర్వహించనున్న తెలంగాణ లా సెట్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 11న టిసాట్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన లైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిసాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిపుణ ఛానల్‌లో ఈ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లా సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి పాల్గొని పరీక్షకు సంబంధించిన సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ సందేహాలను లైవ్‌లోనే నివృత్తి చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. లైవ్ కార్యక్రమం అనంతరం ఫిబ్రవరి 12నుంచి మే12 వరకు మొత్తం 90 రోజులపాటు లా సెట్‌కు సంబంధించిన ప్రత్యేక డిజిటల్ పాఠ్యాంశాల ప్రసారాలు కొనసాగుతాయని సీఈవో వివరించారు. రోజుకు రెండు పాఠ్యాంశాల చొప్పున మొత్తం 180 ఎపిసోడ్‌లు ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు టిసాట్ విద్య ఛానల్‌లో, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు నిపుణ ఛానల్‌లో పునఃప్రసారం ఉంటుందని వెల్లడించారు. జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, లా అధ్యయనానికి అవసరమైన అప్టిట్యూడ్ అంశాలపై ప్రత్యేక తరగతులు ఉంటాయని పేర్కొంటూ, టిసాట్ అందిస్తున్న ఈ అవకాశాన్ని తెలంగాణ యువత సద్వినియోగం చేసుకోవాలని వేణుగోపాల్ రెడ్డి సూచించారు.



# పెండింగ్ రైల్వే పనులు వేగవంతం చేయాలి

- **ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబీ), రైల్వే అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యుబీ) పనులను సత్వరమే పూర్తి చేయాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కోరారు. మంగళవారం న్యూఢిల్లీ రైల్ భవన్‌లో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వికాస్ కుమార్ జైన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. గతంలో శంకరపల్లి ప్రాంతానికి వచ్చిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కూడా ఈ అంశంపై వినతి అందజేశామని ఎంపీ తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని రైల్వే సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. వికారాబాద్ పట్టణంలోని జిల్లా కోర్టు సమీపం, ఇంద్రానగర్ ప్రాంతాల్లో రైల్వే లెవెల్ క్రాసింగ్‌ల వద్ద డీపీఆర్‌లు పూర్తయిన నేపథ్యంలో ఆర్ఓబీ, ఆర్‌యుబీ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కొండకల్, ముబారక్‌పూర్, మర్పల్లి, పాత శంకరపల్లి, మొరంగపల్లి, గేట్ వనంపల్లి, గొల్లగూడ, నవాంద్గి, సిద్ధాంతి, శాతం రాయి, ఫతేపూర్ (ఎల్‌హెచ్‌ఎస్) ప్రాంతాల్లో లెవెల్ క్రాసింగ్‌ల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

**- నవాంద్గి స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజీకి సానుకూల స్పందన**

తాండూర్ అసెంబ్లీ నియోజకవర్గం బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వే స్టేషన్‌లో ట్రైన్ నంబర్ 17319/20 హుబ్లీ-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాపేజీ కల్పించాలని కోరుతూ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రైల్ భవన్‌లో వికాస్ కుమార్ జైన్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ నుంచి ఇప్పటికే సానుకూల ప్రతిపాదన వచ్చినందున, రైల్వే బోర్డు ద్వారా తక్షణమే నిర్ణయం తీసుకుని రైలును నిలిపేలా చర్యలు చేపడతారని ఆశిస్తున్నట్లు ఎంపీ ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
11.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఓటీటీలో టాప్ 10 ఎవర్ గ్రీన్ సినిమాలు**

హాయ్ నాన్న (Netflix)
తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే సున్నితమైన కథ. ఈ సినిమాలో ఎమోషన్స్ మరియు క్లైమాక్స్ ప్రేక్షకులను కచ్చితంగా కదిలిస్తాయి.







# ఇండియా–పాక్ మ్యాచ్‌కు గ్రీన్ సిగ్నల్..

## కొలంబో ఫ్లైట్ టికెట్ల ధరలు అమాంతం జంప్!



ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్‌లో ఈ నెల 15న కొలంబోలో భారత్‌తో జరగనున్న మ్యాచ్‌పై పాకిస్థాన్ యూటర్న్ తీసుకుంది. ఇండియాతో మ్యాచ్ ఆడతామని పాక్ అధికారికంగా ప్రకటించగానే, ఫ్లైట్ టికెట్ల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ముఖ్యంగా ముంబయి నుంచి కొలంబోకు రౌండ్ ట్రిప్ టికెట్ల ధరలు నిమిషాల్లోనే రూ.10 వేల వరకు పెరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయి-కొలంబో-ముంబయి టికెట్ ధర సుమారు రూ.60 వేల వరకు చేరిందని సమాచారం. ఇతర భారతీయ నగరాల నుంచి కూడా కొలంబో వెళ్లే విమాన టికెట్ల ధరలు అనూహ్యంగా పెరిగాయి.

ఇదిలా ఉండగా, భారత్‌తో మ్యాచ్ ఆడబోమని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం అధికారికంగా ప్రకటించింది. చర్చల ద్వారా సానుకూల ఫలితం రావడంతో పాటు మిత్రదేశాల విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

గత కొన్ని రోజులుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, ఐసీసీ మధ్య ఈ అంశంపై విస్తృత చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణపై పునరాలోచించాలని శ్రీలంక, యూఏఈ బోర్డులు పీసీబీకి సూచించాయి. అలాగే బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్ కూడా పాకిస్థాన్‌ను మ్యాచ్ ఆడాలని కోరినట్లు వెల్లడించారు. శ్రీలంక ప్రధాని అనుర కుమార దిసానాయకే కూడా పాక్ ప్రధానితో ఫోన్‌లో మాట్లాడినట్లు పాకిస్థాన్ ప్రభుత్వం పేర్కొంది.

# ఆటలోనూ ఆదాయంలోనూ అగ్రస్థానం..

స్మృతి మంధాన దూకుడు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీమిండియా వైస్ కెప్టెన్, ఆర్‌సీబీ సారథి స్మృతి మంధాన ఆటతో పాటు ఆదాయంలోనూ దూసుకెళ్తోంది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026లో ఆర్‌సీబీని విజేతగా నిలబెట్టిన మంధాన, నాలుగేళ్లలో రెండో టైటిల్ అందించింది. అదే సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ కూడా సొంతం చేసుకుంది.మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయం తర్వాత డబ్ల్యూపీఎల్ ట్రోఫీ దక్కడంతో మంధాన బ్రాండ్ విలువ భారీగా పెరిగింది. వ్యాపార వర్గాల అంచనా ప్రకారం 2026 నాటికి ఆమె నికర ఆస్తి విలువ రూ.34 నుంచి రూ.40 కోట్ల మధ్య ఉండొచ్చని సమాచారం. ఇది భారత మహిళా క్రికెటర్లలోనే అత్యధికంగా భావిస్తున్నారు.

బీసీసీఐ గ్రేడ్‌ఏ సెంట్రల్ కాంట్రాక్ట్‌తో పాటు మ్యాచ్ ఫీజులు, డబ్ల్యూపీఎల్‌లో ఆర్‌సీబీ నుంచి రూ.3.5 కోట్ల వేతనం ఆమె ప్రధాన ఆదాయ వనరులు. అంతేకాదు పలు అంతర్జాతీయ, దేశీయ బ్రాండ్ల ఎండార్స్‌మెంట్లతో కూడా కోట్లలో ఆదాయం వస్తోంది. ఆటలో స్థిరత్వం, అభిమానుల్లో క్రేజ్ పెరగడంతో స్మృతి మంధాన భారత మహిళా క్రికెట్‌లో ఆర్థికంగా అత్యంత విజయవంతమైన ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తోంది.

# ఓపెనర్లతోనే మ్యాచ్ ఫినిష్

- కివిస్ ఊచకోత..
  యూఏఈ విలవిల

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్



టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ తన దూకుడు ఆటతో మరో ఘన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. గ్రూప్-డి మ్యాచ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై 10 వికెట్ల తేడాతో అలవోకగా గెలిచి పాయింట్ల పట్టికలో తన స్థితిని మరింత బలోపేతం చేసుకుంది. 174 పరుగుల లక్ష్యాన్ని ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా కేవలం 16 ఓవర్లలోనే ఛేదించడం కివీస్ ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. కెప్టెన్ మహ్మద్ వసీం చివరి వరకు క్రీజ్‌లో నిలిచి 66 పరుగులతో అజేయంగా నిలిచాడు. అలీషాన్ సరాఫు 55 పరుగులతో మంచి మద్దతిచ్చాడు. మధ్య ఓవర్లలో యూఏఈ పరుగుల వేగాన్ని కట్టడి చేయడంలో న్యూజిలాండ్ బౌలర్లు సఫలమయ్యారు. మాట్ హెన్రీ రెండు వికెట్లు పడగొట్టగా, మిగతా బౌలర్లు చెరో వికెట్ సాధించారు.

లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడింది. అయితే ఓవర్ గడిచే కొద్దీ టిమ్ సీఫెర్ట్, ఫిన్ అలెన్ గేర్ మార్చారు. ఒక్క ఓవర్‌లో భారీ పరుగులు సాధించడంతో మ్యాచ్ పూర్తిగా కివీస్ వైపు మళ్లింది. సీఫెర్ట్ 42 బంతుల్లో 89 పరుగులు చేయగా, అలెన్ 50 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు.ఓపెనర్ల అద్భుత భాగస్వామ్యంతో న్యూజిలాండ్ ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని చేరుకుంది. ఈ విజయం ద్వారా టీ20 ప్రపంచకప్ చరిత్రలో వికెట్ నష్టంలేకుండా భారీ లక్ష్యాన్ని ఛేదించిన జట్ల జాబితాలో కివీస్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

# డీ లీడే ఆల్‌రౌండ్ షో..

## నమీబియాపై నెదర్లాండ్స్ ఘన విజయం

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో నెదర్లాండ్స్ తొలి గెలుపు నమోదు చేసింది. పాకిస్థాన్‌తో జరిగిన సమీప పోరులో ఓటమి ఎదురైనప్పటికీ, ఆ ప్రభావం చూపకుండా నమీబియాపై ఆధిపత్యం ప్రదర్శించింది. గ్రూప్‌ఏలో భాగంగా ఢిల్లీ వేదికగా జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది.

జాన్ నికోల్ లాఫ్టీ, జాన్ ఫ్రైలింక్ జట్టును గౌరవప్రదమైన స్కోర్‌కి చేర్చారు. అయితే మిగతా బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు.

నెదర్లాండ్స్ బౌలింగ్‌లో బాస్ డీ లీడే, లోగన్ వాన్ బ్రీక్ కీలక బ్రేక్‌లు ఇచ్చారు. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్ కూడా ఒక్కో వికెట్ తీసి ఒత్తిడి పెంచారు.

తరువాత లక్ష్య ఛేదనలో బాస్ డీ లీడే బ్యాట్‌తో చెలరేగాడు. అజేయంగా 72 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపించాడు. బ్యాట్, బంతితో సమానంగా రాణించిన డీ లీడేకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.




# గంభీర్, సూర్యకు బీసీసీఐ షాక్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో టీమిండియా మేనేజ్‌మెంట్ చేసిన విజ్ఞప్తిని బీసీసీఐ తిరస్కరించింది. మెగా టోర్నీ సమయంలో ఆటగాళ్ల కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వాలన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అభ్యర్థనకు బోర్డు నో చెప్పింది. జట్టు ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది.

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ పరాజయం తర్వాత బీసీసీఐ జారీ చేసిన కఠిన గైడ్‌లైన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించింది. విదేశీ పర్యటనల్లో కుటుంబ సభ్యుల హాజరును పరిమితం చేయగా, దీర్ఘకాలిక టూర్లలో కూడా కొద్ది రోజులకు మాత్రమే అవకాశం ఉంది. ఆటగాళ్లు సొంత ఖర్చులతో ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది కానీ ఒకే గదిలో ఉండేందుకు అనుమతి లేదు.

టీమ్ బస్సులోనే ప్రయాణం, వ్యక్తిగత వాహనాల నిషేధం, ప్రైవేట్ మేనేజర్లు, చెఫ్‌లకు హోటల్‌లో ప్రవేశం లేకపోవడం వంటి నిబంధనలు యథాతథంగా కొనసాగనున్నాయి. అనధికారిక జట్టు సమావేశాలకు హాజరు తప్పనిసరి అని బోర్డు స్పష్టం చేసింది.

జాతీయ ఛానెల్ కథనం ప్రకారం, ప్రపంచకప్ సమయంలో ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్ కుటుంబాలను అనుమతించాలని మేనేజ్‌మెంట్ కోరినా బీసీసీఐ అంగీకరించలేదు. భారత జట్టు స్వదేశీ మ్యాచ్‌లను ఐదు నగరాల్లో ఆడనుండగా, పాకిస్థాన్‌తో మ్యాచ్ కొలంబోలో జరగనుంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
11.02.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





# బన్నీని కలవాలంటే అవి పాటించాలా?

**అల్లు అర్జున్‌పై వైరల్ అవుతున్న కామెంట్స్**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'పుష్ప-2' తర్వాత మరో భారీ చిత్రానికి సిద్ధమయ్యారు. ఈసారి కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీతో చేతులు కలిపిన బన్నీ, ఫస్ట్ టైమ్ ఈ కాంబో కావడంతో అభిమానుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. 'జవాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా, అల్లు అర్జున్‌ను కలవడంపై ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు టాలీవుడ్‌తో పాటు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ప్రముఖ రాయల్ ఎన్‌ఫీల్డ్ బ్రాండ్ స్ట్రాటజీ విభాగం మేనేజర్ కావేరి బారువా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని మాట్లాడుతూ, అల్లు అర్జున్‌ను కలవాలంటే కఠినమైన నిబంధనలు ఉంటాయని చెప్పింది. మొత్తం 42 రూల్స్ పాటించాలని, ఆయన కళ్లలోకి చూడకూడదని, షేక్ హ్యాండ్ ఇవ్వకూడదని ముందుగానే తమకు సూచనలు వచ్చాయని ఆమె వెల్లడించింది.ఈ వ్యాఖ్యలు బయటకు రావడంతో నెటిజన్లు సోషల్ మీడియాలో విభిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటే, మరి కొందరు దీనిపై సరదా కామెంట్స్ చేస్తున్నారు. అయితే కావేరి బారువా చేసిన ఈ వ్యాఖ్యలు నిజమా కాదా అన్న విషయంలో స్పష్టత రావాలంటే అల్లు అర్జున్ టీమ్ నుంచి అధికారిక క్లారిటీ రావాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# స్టైలిష్ లుక్‌తో హాట్ హాట్ గా హెబ్బా పటేల్

'ఎఫ్2' సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డమ్‌ను అందుకున్న నటి హెబ్బా పటేల్, దాదాపు పదేళ్లు గడిచినా ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం నిలుపుకుంది. చలాకీ నటన, పక్కింటి అమ్మాయి లాంటి సహజమైన ఇమేజ్‌తో యువతకు బాగా దగ్గరైన ఆమె, ఆ ఫ్యాన్‌బేస్‌ను ఇప్పటికీ నిలబెట్టుకుంటూ వస్తోంది. తాజాగా హెబ్బా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫోటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో ఆమె స్ట్రాప్‌లెస్ డ్రస్‌లో ఎంతో గ్లామరస్‌గా, అదే సమయంలో గ్రేస్‌ఫుల్‌గా కనిపిస్తోంది. డ్రస్ పై భాగం డార్క్ షేడ్‌లో ఉండగా, కింద భాగం లైట్ పింక్ కలర్‌లో మృదువైన లేయర్లతో ఫ్లోయీ లుక్‌ను ఇస్తోంది. సైడ్‌లో ఉన్న పెద్ద ఫ్లవర్ డిజైన్ ఔట్‌ఫిట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఓపెన్ హెయిర్‌లో సాఫ్ట్ కర్ల్స్, సింపుల్ మేకప్‌తో హెబ్బా సహజ అందాన్ని మరింత హైలైట్ చేసింది. మొత్తంగా ఈ లుక్ క్లాసీగా, ఆకట్టుకునేలా ఉండటంతో అభిమానులు ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. గ్లామర్‌తో పాటు ఎలిగెన్స్‌ను బ్యాలెన్స్ చేస్తూ హెబ్బా మరోసారి అందరి తనవైపు తిప్పకుంది.



# మైథాలజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కిరణ్ అబ్బవరం..

**పాన్ ఇండియా ప్రాజెక్ట్ స్టార్ట్!**

టాలీవుడ్ హీరో కిరణ్ అబ్బవరం మరో భారీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఓ పాన్ ఇండియా సినిమాలో ఆయన కీలక పాత్రలో నటించనున్నట్లు సమాచారం. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేపథ్యంగా తీసుకుని, అద్భుతమైన విజువల్స్‌తో ఈ చిత్రాన్ని మైథాలజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి.గ్రాండ్ సెట్స్, స్ట్రాంగ్ వరల్డ్ బిల్డింగ్, హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో సినిమాను రూపొందించేందుకు టీమ్ సిద్ధమవుతోంది. షూటింగ్‌ను సెప్టెంబర్‌లో ప్రారంభించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక హీరోయిన్ ఎంపిక విషయానికి వస్తే, టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ నటీమణుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా టైటిల్, దర్శకుడు, ఇతర నటీనటులు మరియు టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. భక్తి, భావోద్వేగాలు, డ్రామా, హై వోల్టేజ్ యాక్షన్‌ల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# లంగావోణీలో ఆషికా రంగనాథ్..

లంగావోణీ లుక్‌లో ఆషికా రంగనాథ్ మరోసారి అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. రెండు జడల హెయిర్‌స్టైల్‌తో సింపుల్‌గా కనిపిస్తున్న ఆమె క్యూట్‌నెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. సహజమైన అందం, చిలిపి చిరునవ్వుతో ఉన్న ఈ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. 'నా సామిరంగా' సినిమాతో తెలుగు యువత మనసులు గెలిచిన ఆషికా, ఈ సంక్రాంతికి విడుదలైన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో మరో హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. వరుస విజయాలతో టాలీవుడ్‌లో తన స్థానం మరింత బలపడుతోంది. దీనికి ముందు ఆమె నటించిన డబ్బింగ్ చిత్రం 'గతవైభవం' థియేటర్లలో పెద్దగా సందడి చేయకపోయినా, ఓటీటీ విడుదలైన తర్వాత మంచి స్పందన అందుకుంటోంది. ఈ సానుకూల స్పందన మధ్య, 'గతవైభవం' సినిమా సెట్స్‌లో దిగిన కొన్ని క్యూట్ ఫోటోలను ఆషికా తాజాగా తన సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేసింది. లంగావోణీ, రెండు జడలతో సంప్రదాయ అందాన్ని ప్రతిబింబిస్తూ ఉన్న ఆమె లుక్‌కు నెటిజన్లు ఫుల్‌గా లైక్స్, కామెంట్స్ వర్షం కురిపిస్తున్నారు. ఇలా సినిమాలతో పాటు తన స్టైలిష్ అండ్ గ్రేస్‌ఫుల్ లుక్స్‌తోనూ ఆషికా ఎప్పటికప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.



# రూ.2.5 కోట్లు చెల్లించకపోతే జైలుకే..

**రజనీ నిర్మాతకు హైకోర్టు ఆదేశాలు**

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కొచ్చడైయాన్' నిర్మాత మురళీమనోహర్‌కు మద్రాసు హైకోర్టులో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. పదేళ్ల క్రితం నాటి చెక్ బౌన్స్ కేసులో కీలక తీర్పు వెలువరించిన న్యాయస్థానం, బెంగళూరుకు చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ సంస్థకు నెల రోజుల్లో రూ.2.5 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని గడువులోగా చెల్లించకపోతే ఆరు నెలల జైలు శిక్ష తప్పదని కోర్టు స్పష్టం చేసింది. 'కొచ్చడైయాన్' నిర్మాణ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న మురళీమనోహర్, యాడ్ బ్యూరో సంస్థ నుంచి రుణం తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో రూ.5 కోట్ల చెక్కును ఇచ్చారు. అయితే ఖాతాలో నిధులు లేకపోవడంతో చెక్ బౌన్స్ కావడంతో కేసు కోర్టుకు వెళ్లింది. ఈ కేసులో ట్రయల్ కోర్టు ఇప్పటికే శిక్ష విధించగా, దానిపై దాఖలైన అప్పీల్‌ను హైకోర్టు కూడా తిరస్కరించింది. జైలు శిక్ష నుంచి తప్పించుకోవాలంటే వెంటనే బకాయిలో సగాన్ని చెల్లించాలని తుది ఆదేశాలు జారీ చేసింది.



# జోర్డాన్‌లో ఎన్టీఆర్ హై వోల్టేజ్ యాక్షన్..

**'డ్రాగన్'పై అంచనాలు పీక్స్‌కు!**

యంగ్ టైగర్ ఎన్టీఆర్ - దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ మూవీ 'డ్రాగన్'పై ఫ్యాన్స్‌లో రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతుండగా, ఎన్టీఆర్‌పై భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ షెడ్యూల్ పూర్తయ్యాక ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు టాక్. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ మార్క్ మాస్ ట్రీట్‌మెంట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో యాక్షన్ ఎపిసోడ్స్ కీలకంగా ఉండనున్నాయి. ఎన్టీఆర్ కెరీర్‌లో ఇది ఓ ప్రత్యేక చిత్రంగా నిలవాలనే లక్ష్యంతో దర్శకుడు స్క్రిప్ట్ నుంచి ప్రతి అంశాన్ని ఎంతో జాగ్రత్తగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది.మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ చిత్రం జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ తొలి కలయిక కావడంతో బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com